
తిరుమలలో ఫలపుష్ప ప్రదర్శనకు ఏర్పాట్లు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల వ్యాప్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాల సుందరీకరణ పనుల్లో భాగంగా స్థానిక కల్యాణవేదికలో ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రవేశ మార్గంలో ఏర్పాటు చేసేందుకు భారీ శ్రీవారి కటౌట్‌ను చిత్రకారులు రూపొందిస్తున్నారు. హనుమంతుడు, గరుత్మంతుడు, అన్నమయ్య, శ్రీ మహావిష్ణువు, వెంగమాంబ కటౌట్లను తీర్చిదిద్దుతున్నారు. శ్రీవారి ఆలయంలోనూ ప్రత్యేక లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

చంద్రప్రభ వాహనాయా... రక్షమాం


చంద్రప్రభ పల్లకిలో వరసిద్ధుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజున శ్రీ వరసిద్ధి వినాయ స్వామి వారు సిద్ధిబుద్ధిలతో కలసి చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి మంగళవారం రాత్రి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను ఓలలాడించారు. స్వామివారి మూలవిగ్రహానికి ఉదయం సంప్రదాయబద్ధంగా పంచామృతాభిషేకం నిర్వహించి, చందనాలకంరణ చేసి ప్రత్యేక నివేదన సమర్పించారు. ఉత్సవమూర్తులను సర్వాలంకృతులు చేసి అలంకార మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పి.గురుప్రసాద్, కాణిపాకం సర్పంచి కె.శాంతిసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కల్పవృక్ష వాహన సేవ

ప్రత్యేకోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యమైన కల్పవృక్ష వాహన సేవ బుధవారం రాత్రి జరగనుంది. ఉదయం స్వామి వారి ఉత్సవమూర్తులకు శతకలశ క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులు కోరారు. జిల్లాలో గృహావసరాల గ్యాస్ కనెక్షన్లు 6.87 లక్షలు ఉన్నాయి. ఇప్పటి వరకు 67 శాతం మంది వినియోగదారులే ఈకేవైసీ చేయించుకోగా.. మిగిలిన 33 శాతం మంది నమోదు చేయించుకోవాల్సి ఉందని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు దీపావళి నుంచి ఉచితంగా మూడు సిలిండర్లు ఇవ్వనున్నారు. ఈకేవైసీ చేయించుకున్న వినియోగదారులకే పథకానికి అర్హత ఉంటుంది.

జాతరకు 70 బస్సులు

వెంకటగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మ జాతరకు స్థానిక డిపోతో పాటు రాపూరు, గూడూరు, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి మొత్తం 70 ఆర్టీసీ బస్సులు నడుస్తాయని డీఎం రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి-డక్కిలి మండలం కమ్మవారిపల్లి, దగ్గవోలుతో పాటు బాలాయపల్లి మండలం నిడిగల్లు, జయంపు మార్గాలతో పాటు వెంకటగిరి మండలంలోని పలు గ్రామాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ దృష్టి.. సంపద సృష్టి

- పల్లెల పూర్వ వైభవానికి అడుగులు

సుందర గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. నూటికి నూరు శాతం ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ చేపట్టి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక చేస్తోంది. గత వైకాపా పాలనలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరగా కూటమి ప్రభుత్వం వాటి పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేస్తోంది. – న్యూస్‌టుడే, గూడూరు


తాళ్వాయపాడులోని చేపల పెంపకం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,189 సంపద సృష్టి కేంద్రాలున్నాయి. వీటిలో అన్ని వసతులున్నవి 280 వరకు ఉన్నాయి. తొలిదశలో వాటి పునఃప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గ్రామాల శుభ్రతకు పక్కాగా చర్యలు తీసుకోనున్నారు. పంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉండటంతో సర్పంచులు ముందుకొస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలను తెదేపా ప్రభుత్వం 2015లో తీసుకొచ్చింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. ఉపాధిహామీ నిధులు జోడించి వసతులు సమకూర్చారు. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించారు.

- పెళ్లకూరు మండలం తాళ్వాయపాడు కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అప్పటి సర్పంచి అనురాధ తడిపొడి చెత్తతోపాటు చేపల పెంపకం, కూరగాయల సాగు చేపట్టారు.

కేంద్రాల్లో వసతుల వివరాలిలా.. (తిరుపతి)

షెడ్లు	610
నీటి వసతి	365
రోడ్డు	531
మరుగుదొడ్లు	79
బోర్డులున్నవి	555
విద్యుత్తు	172


అనకవోలు గ్రామంలోని చెత్త సంపద కేంద్రం

ఎరువుల తయారీ..

ప్రతి గ్రామంలో చెత్త సంపద కేంద్రం నుంచి సేంద్రియ ఎరువు తయారీ చేయాల్సి ఉంది. గ్రామాల్లో వచ్చే చెత్తను హరిత రాయబారుల సహకారంతో షెడ్లకు చేర్చి 12 కంపోస్ట్ మెంట్లలో వేయాలి. చెత్తను వానపాముల ద్వారా ఎరువు తయారీ చేయాల్సి ఉంది. ఇలా తయారైన ఎరువులను విక్రయించడంతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.

అన్నిచోట్లా వసతులు కల్పిస్తాం

అన్నిచోట్లా దశలవారీగా వసతులు కల్పిస్తాం. ఇందుకు అవసరమైన నిధులు వెచ్చించడానికి అవకాశముంది.
- సుశీలాదేవి, జిల్లా పంచాయతీ అధికారి, తిరుపతి

వినాయకా.. ఇక్కడెంత సురక్షితం

సరకుల కొనుగోలులో గతంలో గోప్యత



కాణిపాకం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలకు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్లు వెల్లడయిన నేపథ్యంలో కాణిపాకం ఆలయంలో ఎంతవరకు నిబంధనలు పాటించారు.. అనే కోణంలోనూ భక్తులు ఆందోళన చెందుతున్నారు. స్వామివారి ఆలయంలో ఉప్పు, చక్కెర పొంగలి ఇతర ప్రసాదాలతోపాటు భక్తులకు అందించే లడ్డూ ప్రసాదాల తయారీకి నెలకు సుమారు మూడు వేల కిలోల నెయ్యి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్పటివరకు బాగానే ఉన్నా.. 2018 నుంచి ఆలయానికి ప్రైవేటు డెయిరీల నుంచి నెయ్యి సేకరిస్తున్నారు. అంతకుముందు కేఎంఎఫ్ (కర్ణాటక మిల్క్ ఫెడరేషన్) నుంచి కొనుగోలు చేసేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రివర్స్ టెండరింగ్, సంప్రదింపుల పద్ధతి అవలంబించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంతోపాటు కాణిపాకం ఆలయానికి తిరుపతికి చెందిన ఓ సంస్థ నుంచి సరకులు కొంటున్నారు. కేఎంఎఫ్ కాకుండా మరో రెండు ప్రైవేటు డెయిరీలకు చెందిన నెయ్యిని కొనుగోలు చేశారు. అలాగే ఆలయానికి కావాల్సిన సరకులు కొనుగోలు వైకాపా హయాం ఐదేళ్లు చాలా గోప్యంగా ఉంచారు. గతేడాది తిరుమలకు నెయ్యి సరఫరా చేస్తున్న వైష్ణవి సంస్థ నుంచి కిలో రూ.555 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ డెయిరీల నుంచి కాకుండా ప్రైవేటు వాటిపై మక్కువ చూపడం నుమానాలకు దారి తీస్తోంది.

కమిటీలున్నా.. తనిఖీలు సున్నా

గత ప్రభుత్వ హయాంలో కాణిపాకం ఆలయ పాకలమండలి తంపున కొనుగోలు కమిటీ ఏర్పాటు చేశారు. ఆలయానికి కావాల్సిన సరకులు, ఇతర వస్తువులు ఈ కమిటీ పరిశీలించి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఏ ఒక్కరోజూ ఆలయానికి వచ్చిన సరకులను కమిటీ పరిశీలించిన దాఖలాలు లేవు. గుత్తేదారులు పంపిన వస్తువులను యథావిధిగా ఆలయ గిడ్డంగికి చేర్చేవారు. ఫలితంగా నాణ్యతపై భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. 2018 ముందుకు ఆలయానికి వచ్చే సరకులను ప్రభుత్వ ఆహార తనిఖీ సంస్థ వచ్చి.. శాంపిల్స్‌ను తీసుకెళ్లి పరిశీలించేది. గత ఐదు సంవత్సరాలు గుత్తేదారుడు ఇచ్చిన నివేదికలను ఆధారం చేసుకొని కొనుగోలు చేశారు. రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ గత శనివారం ఆలయ గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసాదాల తయారీకి కొనుగోలు చేస్తున్న నెయ్యి వెంటనే ప్రభుత్వరంగ సంస్థకు పంపి నాణ్యత పరిశీలించాలని ఆదేశాలు జారీచేశారు. అధికారులు నెయ్యి శాంపిల్‌ను తనిఖీ నిమిత్తం పంపారు. ఆలయానికి కొనుగోలు చేస్తున్న నెయ్యి నాణ్యతపై భక్తుల్లో నెలకొన్న ఆందోళనలు తొలగించి, భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇద్దరు సబ్ ఇంజినీర్లపై వేటు

నియంత్రికల మరమ్మతు కేంద్రాల అక్రమాలపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పలమనేరు, పీలేరు నియంత్రికల మరమ్మతు కేంద్రాల అక్రమాలపై ఆ శాఖ అధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. 'ఈనాడు'లో ఈనెల 23న 'కాలిన కమ్మీల్లో..కోట్లు దండుకున్నారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్తు శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు స్పందించారు. అవినీతికి పాల్పడిన పలమనేరు, పీలేరు నియంత్రికల మరమ్మతు కేంద్రాల సబ్-ఇంజినీర్లు సూర్యతేజ, కమల్ గణేష్‌లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు వివరించారు. అక్కడి ఏఈలకు బాధ్యతలు అప్పగించారు. తుప్పు కమ్మీలను అక్రమంగా విక్రయించి నిధులు స్వాహా చేసిన అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. నియంత్రికల మరమ్మతు కేంద్రాల ఈఈ మహేశ్వర్‌రెడ్డి కడప జిల్లాకు బదిలీ అయ్యారు. అవినీతి అక్రమాలపై విచారణ పూర్తయ్యేంతవరకు ఈయన ఇక్కడి నుంచి రిలీవ్ కాకూడదని ఉన్నతాధికారులు సూచించినట్లు సమాచారం.

వంతెనల కిందా తోడేశారు

సువర్ణముఖి నదిలో ఎంత కట్టడి చేసినా ఇసుక అక్రమ తవ్వకాలు తగ్గుముఖం పట్టడం లేదు. తాజాగా బైపాస్ వంతెన పక్కన ఆరు వరుసల రహదారి కోసం వంతెన నిర్మించారు. రాత్రివేళల్లో జేసీబీల సాయంతో వంతెన కింద, అందులోనూ వంతెనకు వేసిన పిల్లర్ల మధ్యన ఇష్టానుసారం ఇసుక తోడేస్తున్నారు. ఇప్పటికే పది అడుగుల లోతుకు పైగా తవ్వేశారు. ఇలాగే వదలిపెడితే రానున్న వర్షాకాలంలో వంతెన పిల్లర్లకు ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. ఇకనైనా వంతెన సమీపంలో ఇసుక తరలింపును నియంత్రించే దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.
– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



వెలుగు జిలుగుల.. మహల్



చంద్రగిరిలోని రాయవారికోటలో ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని అద్భుత రూపవాణిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో రాయలవారి కోట ప్రాంగణంలో పాడైపోయిన విద్యుత్తు సరఫరాను సాంకేతిక నిపుణులు పునరుద్ధరించారు. మంగళవారం రాత్రి రాజమహల్, రాణీ మహల్‌తో పాటు అనుసంధానంగా ఉన్న శ్రీరాజరాజేశ్వరి పురాతన దేవాలయంలో వెలుగులను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.– న్యూస్‌టుడే, చంద్రగిరి

లడ్డూలో పొగాకు పొట్లం అవాస్తవం: తితిదే


తిరుమల, న్యూస్‌టుడే: పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంలో పొగాకు పొట్లం ఉన్నట్లు కొంతమంది భక్తులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం తగదని, అది అవాస్తవమని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. 'తిరుమలలోని లడ్డూ పోటులో శ్రీవైష్ణవ బ్రాహ్మణులు అత్యంత భక్తిశ్రద్ధలు, నియమనిష్టలతో తయారు చేస్తారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించాల'ని తితిదే కోరింది.

కలెక్టరేట్ సూపరింటెండెంట్‌పై చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్ సూపరింటెండెంట్ సురేష్‌బాబుపై మంగళవారం ప్రభుత్వం సస్పెన్షన్ వేటు విధించింది. పుత్తూరులో పెట్రోల్ బంక్ అనుమతులకు లంచం డిమాండ్ చేశారంటూ బాధితుడు పరమేశ్వరస్వామి సీసీఎల్ఏకు ఇటీవల ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులు సురేష్‌బాబు నగదు డిమాండ్ చేసినట్లు విచారణలో నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఇదే కేసులో ఆర్డీవో నిషాంత్‌రెడ్డి వేటుకు గురైన సంగతి తెలిసిందే.

తేలనున్న ఫ్రీహోల్డ్ గుట్టు

- రిజిస్ట్రేషన్లపై విచారణ పదిరోజుల్లో పూర్తిచేసేలా సన్నద్ధం
- అన్ని మండలాల్లోనూ కొనసాగనున్న పరిశీలన



ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (కలెక్టరేట్) : ఫ్రీహోల్డ్ అక్రమాల బాగోతంపై ఉన్నతాధికారులు దృష్టించారు. వైకాపా నేతలు నిబంధనలు అతిక్రమించి భూములను కొట్టేసిన వ్యవహారంపై సమగ్ర దర్యాప్తునకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం తెలిసిందే. ఇప్పటికే శ్రీకాళహస్తి మండలం పరిధిలో పరిశీలించగా పలు అక్రమాలు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అక్రమాలను నిగ్గు తేల్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది.

భూములను ఫ్రీహోల్డ్ చేసిన వ్యవహారంలో ఎక్కువగా రాయలసీమ ప్రాంతంలోనే అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఇప్పటికే ఉన్నతాధికారులు గుర్తించారు. ముఖ్యంగా కుంటలు, వాగులు, కాలువ పోరంబోకు ఇలాంటి వాటిని పెద్దఎత్తున మినహాయింపు ఇచ్చినట్లు భావిస్తున్నారు. వాస్తవానికి గతంలో వీటికి డీకేటీ ఇచ్చినప్పటికీ రెవెన్యూ దస్త్రాల్లో వీటి వర్గీకరణలో మార్పులు చేయలేదు. దీనివల్ల ఇప్పటికీ ఎ1 రిజిస్టర్‌లో కొనసాగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వీటిని ఫ్రీహోల్డ్ ఎలా చేస్తారని ఉన్నతాధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి వాటిని మినహాయించడమే కాకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సైతం పూర్తిచేసినట్లు భావిస్తున్నారు. 2003 ముందు ఇచ్చిన డీకేటీ భూములను మాత్రమే జాబితాలో చేర్చాలి. అయితే కొన్నిచోట్ల నిబంధనలు అతిక్రమించి తరువాత ఇచ్చిన వాటినీ నిషేధిత జాబితా నుంచి తొలగించారు.

ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలు (ఎకరాల్లో)

జిల్లా మొత్తం	76210.03
కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ	44716.54
రిజిస్ట్రేషన్ అయిన దస్త్రాలు	2,200
విస్తీర్ణం	4,200 ఎకరాలు

డివిజన్లవారీగా ఫ్రీహోల్డ్ భూములు ఎకరాల్లో

డివిజన్	ఎకరాలు
తిరుపతి	12256.54
శ్రీకాళహస్తి	25752.99
గూడూరు	21948.66
సూళ్లూరుపేట	16251.84

దస్త్రాలతో క్షేత్రస్థాయికి వెళ్లి

ఫ్రీహోల్డ్ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన భూములను అధికారులు తొలుత పరిశీలించనున్నారు. మొత్తం 4,200 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఇప్పటికే గుర్తించారు. ప్రతి దస్త్రాన్ని తీసుకుని క్షేత్రస్థాయికి వెళ్లి సదరు భూములు ఎప్పుడు ఇచ్చారు, ఎవరి పేరుతో ఇచ్చారు, ప్రస్తుతం అతని పేరుతోనే చేశారా, రిజిస్ట్రేషన్లు ఎవరి పేరుతో జరిగాయనే పూర్తి వివరాలు సేకరించనున్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వాటిపై పది రోజుల్లో విచారణ ప్రక్రియ పూర్తి చేసేందుకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చర్యలు చేపట్టారు. ఆయనతోపాటు జేసీ శుభం భన్సల్ స్వయంగా ఈ ప్రక్రియను పరిశీలించనున్నారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల: టోకెన్లు లేకుండా తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 2 గంటలు పడుతోంది. సోమవారం శ్రీవారిని 65,604 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.85 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

గూడూరు, పేటలకు పరిశ్రమల వరుస

రూ.113 కోట్లతో అత్తివరంలో ఏర్పాటు


అత్తివరంలోని పారిశ్రామిక పార్కు

గూడూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పనపై దృష్టి పెట్టింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం ద్వారా భూముల కేటాయింపును పూర్తి చేసింది. తాజాగా జరిగిన స్టేట్ ల్యాండ్ అలాట్‌మెంట్ కమిటీ (ఎస్ఎల్ఏసీ) పరిశ్రమలకు అవసరమైన భూములు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో రెండు రెవెన్యూ డివిజన్లలో పరిశ్రమలు వరుసకట్టే అవకాశం కలిగింది.

గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గంలో 24 పరిశ్రమలకు భూములు కేటాయించారు. సుమారుగా రూ.200 కోట్ల పెట్టుబడులు ఇక్కడికి రానున్నాయి. అటు ఓజిలి మండలం అత్తివరం, తడ మండలం మాంబట్టు ఇండస్ట్రియల్ పార్కులతోపాటు గూడూరు ఆటోనగర్‌లో భూమి కేటాయిస్తూ ఇటీవల రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకోగా తాజా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఇక్కడ వందల మందికి ఉపాధి లంభించనుంది.

జిగురు తయారీతో..

అత్తివరంలో స్టార్ ఇండస్ట్రీస్ జిగురు తయారీ కోసం రెండు ఎకరాల భూమి తీసుకుంది. ఇక్కడ ఏర్పాటుచేసే రేసిన్స్ తయారీ పరిశ్రమతో 43 మందికి ఉపాధి లభించనుంది. రూ.113 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. తడ మండలం మాంబట్టులో మరో పరిశ్రమ 7.14 ఎకరాలు తీసుకుంది. ఇక్కడ ఏఏసీ బ్లాక్ తయారీకిగాను రూ.20 కోట్లు వెచ్చించనుండగా 95 మందికి ఉపాధి కల్పించనుంది.

ఎంఎస్ఎంఈలకు అనుకూలం

వెస్ట్ గూడూరులోని ప్లాట్లలో 15 మంది భూమి కోసం దరఖాస్తు చేసుకోగా వారికి ఎట్టకేలకు భూములు అప్పగించారు. ఎస్సీ, ఎస్టీలకు భూములు రాయితీపై ఇవ్వడానికి అవకాశం కలిగింది. ఆటో మొబైల్, వెహికల్ బాడీ బిల్డింగ్ వర్క్స్, టైర్‌వర్క్ తదితర సంస్థలు ముందుకొచ్చాయి. ఇక్కడ 500 మంది పైగా ఉపాధి లభించనుందని పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి.

అందుబాటులోకి 800 నియంత్రికలు

చిత్తూరు(మిట్టూరు): చిత్తూరులోని విద్యుత్తు శాఖ గోదాముకు మంగళవారం 63కేవీ నియంత్రికలు 800 చేరాయి. అవసరాలకు అనుగుణంగా నియంత్రికలు, అనుబంధ పరికరాలు అందుబాటులో ఉన్నాయని విద్యుత్తు శాఖ ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు.

వైకాపా పాలనలో మాఫియాకు పాలక మండలి సభ్యులుగా అవకాశం

దొడ్డిదారిన ఈవోగా వచ్చిన ధర్మారెడ్డి: నారాయణ



తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో తితిదే పాలక మండలి సభ్యులుగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాఫియాను సభ్యులుగా నియమించారని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె. నారాయణ ఆరోపించారు. తితిదేను అపవిత్రం చేసిన ఘనత నాటి ఈవో ధర్మారెడ్డికే దక్కిందన్నారు. అర్హత లేకపోయినా ఆయన్ని దొడ్డిదారిన తితిదే ఈవోగా నియమించారని విమర్శించారు. మంగళవారం తిరుపతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. 'అతి తక్కువ ధరకు నెయ్యి కొనుగోలు చేయడం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొంది. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీయడం బాధాకరం. నందినీ లాంటి నెయ్యిని కొనుగోలు చేయడంపై తితిదే దృష్టి సారించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి అనుకూలంగా సిట్ రిపోర్టు ఇవ్వడం సర్వసాధారణం. దేశంలో వామపక్ష శక్తులను అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడం తగదు. దేశంలో నరేంద్రమోదీని ప్రజలంతా తిరస్కరించారు. కేవలం నారా చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్ సహకారంతోనే ప్రభుత్వం నడుస్తోంది' అని అన్నారు.

అటవీశాఖ తిరుపతి సర్కిల్‌లో బదిలీలు

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: అటవీశాఖ తిరుపతి సర్కిల్ పరిధిలో డీఎఫ్‌వో, సబ్ డీఎఫ్‌వో, కార్యాలయ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. జిల్లా అటవీశాఖ డీఎఫ్‌వోగా పనిచేసిన జి.సతీష్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో త్వరలోనే ఐఎఫ్ఎస్ అధికారిని నియమించనున్నారు. తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎమ్.శివకుమార్ కడప జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న జి.శ్రీనివాసులును నియమించారు. తిరుపతి బయోట్రిమ్ అసిస్టెంట్ స్టేట్ సిల్వికల్చరిస్టుగా, ఎర్రచందనం కేంద్రీయ గోదాముల ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న ఎన్.శివకుమార్ సాంగ్లా మంగళగిరిలోని పీసీసీఎఫ్ కార్యాలయంలోని విజిలెన్స్ వింగ్‌కు బదిలీ అయ్యారు. తిరుపతి బయోట్రిమ్ ఏసీఎఫ్‌గా చిత్తూరు సామాజిక అటవీశాఖ డీఎఫ్‌వో కె.సోమశేఖరన్ నియామకమయ్యారు. తిరుపతి సబ్ డీఎఫ్‌వోగా పనిచేసిన టి.శ్రీనివాసరావు రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా కడప ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న ఎమ్.గురుప్రభాకర్ నియామకమయ్యారు. తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తున్న సి.వి.రత్నం అనంతపురం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా నియామకం కాగా, ఆయన స్థానంలో ఏలూరు నుంచి హిమబిందు నియామకమయ్యారు. తిరుపతి జిల్లా అటవీశాఖ కార్యాలయం పరిపాలన అధికారిగా పనిచేస్తున్న అప్పారావు విజయనగరానికి బదిలీ అయ్యారు.

డీఎస్‌వోగా శేషాచలం రాజు

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ జిల్లా సరఫరాల అధికారి(డీఎస్‌వో)గా శేషాచలం రాజు నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా సహాయ సరఫరాల అధికారిగా ఉన్న ఆయన్ను డీఎస్‌వోగా నియమిస్తూ పౌరసరఫరాల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన రాజారఘువీర్‌ను కర్నూల్ డీఎస్‌వోగా బదిలీ చేశారు. శేషాచలం రాజు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి సహాయ సరఫరాల అధికారిగా, విభజన తర్వాత ఇన్‌ఛార్జి డీఎస్‌వోగా పనిచేశారు.

డీటీల నియామకం

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు ఉప తహసీల్దార్లు(డీటీలు) బదిలీ అయ్యారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.అశోక్ రెడ్డి పుత్తూరుకు బదిలీ అయ్యారు. నూతన ఉప తహసీల్దార్‌గా కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న బి.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల ఉప తహసీల్దార్‌గా జి.రామచంద్ర, రీ-సర్వే ఉప తహసీల్దార్‌గా సి.జీవన్‌కుమార్, ఎంఆర్ఐగా జి.కృష్ణమ్మను నియమిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కష్టపడ్డవాళ్లకే పదవులు

పలు కార్పొరేషన్లలో జిల్లా వాసులకు చోటు

ఈనాడు డిజిటల్, తిరుపతి: నిరీక్షణ, ఉత్కంఠకు తెరదించుతూ కూటమి ప్రభుత్వం మంగళవారం పలు నామినేటెడ్ పోస్టుల భర్తీ చేసింది. తొలి నుంచీ పార్టీ పట్ల విధేయత, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉన్న వ్యక్తులకే ఈ జాబితాలో పెద్దపీట వేశారు. తిరుపతి జిల్లాకు చెందిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడుకు కీలకమైన శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలప్పగించారు. వివిధ కార్పొరేషన్లలో సభ్యులుగా జిల్లా నాయకత్వానికి చోటులభించింది. తిరుపతికి చెందిన డాక్టర్ పారీ చందనస్రవంతిని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ సభ్యురాలిగా నియమించారు. ఆమె



డాక్టర్ పారీ చందన స్రవంతి | గంగాధర శ్రీరామదాస్ | పరసా వెంకటరత్నం

తండ్రి చిత్తూరు జడ్పీ మాజీ ఛైర్మన్‌గా పనిచేశారు. 2024 ఎన్నికల్లో భాగంగా సత్యవేడు నుంచి కూటమి అభ్యర్థిగా పోటీచేసేందుకు యత్నించారు. ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి సంస్థ సభ్యునిగా వెంకటగిరికి చెందిన గంగాధర శ్రీరామదాస్‌ను నియమించారు. ఆయన తెదేపా వెంకటగిరి పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

తిరుపతి(నగరం): రాష్ట్ర సహకార, మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్‌గా తిరుపతికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు ఊకా విజయకుమార్ నియమితులయ్యారు. గతంలో ఆయన కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. తిరుపతి నుంచి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు పోటీ చేయడంతో ఆయన తరఫున ప్రచారంలో పాల్గొన్నారు.

నాయుడుపేట: గొట్టిప్రోలు గ్రామానికి చెందిన మాజీ మంత్రి పరసా వెంకటరత్నం రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన 1994, 1999, 2009లో తెదేపా నుంచి సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1995లో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చిస్తున్న తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేయండి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేయాలని తితిదే అధికారులను దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. స్థానిక అతిథిగృహంలో బ్రహ్మోత్సవాలపై తితిదే అధికారులతో మంత్రి సమీక్షించారు. తితిదే ఈవో జె.శ్యామలరావు బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లపై మంత్రికి వివరించారు. అనంతరం మంత్రికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, డిప్యూటీ ఈవో ఆర్1 భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్టు స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి జయరామయ్య తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం హాకీ, బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాకి చెందిన సుమారు 150 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జయరామయ్య వివరించారు. హాకీ శిక్షకులు మాలిని, లక్ష్మీ కరుణ, లక్ష్మీ ప్రసన్న, రమేష్ శ్రీనివాసులు, బ్యాడ్మింటన్ శిక్షకులు నాగరాజు శివయ్య తదితరులు పాల్గొన్నారు.



హాకీ జిల్లా బాలికల జట్టు

27 నుంచి అండర్-19 ఎంపికలు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: అండర్-19 ఉమ్మడి చిత్తూరు స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో సెపక్ తక్రా, సాఫ్ట్‌బాల్, కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 9.30 గంటలకు రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సెపక్ తక్రా, 28న మధ్యాహ్నం 2 గంటలకు చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాఫ్ట్‌బాల్, 30న మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి గ్రామీణం తుమ్మలగుంట క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలు జరుగుతాయని వివరించారు. మరిన్ని వివరాలకు 93936 21004 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ తయారీపై దృష్టి సారించాలి

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్ తయారీపై మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన గోడప్రతులను కూడళ్లు, బ్యాంకులు, సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

'ఆ నలుగురూ క్షమాపణలు చెప్పాలి'

తిరుపతి (భవానినగర్), న్యూస్‌టుడే: తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నాస్తికుడని, ఆయన మునగడంతో పుష్కరిణి కలుషితం అయిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్, మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, న్యాయవాది పొన్నవోలు సుధాకర్ తిరుమలలోని అఖిలాండం వద్ద శ్రీవారి భక్తకోటికి సాష్టాంగ నమస్కారం చేసి క్షమాపణలు చెప్పాలన్నారు. తిరుమలలో భూమన చేసింది ముమ్మాటికి డ్రామానే అని విమర్శించారు. నాయకులు భాస్కర్, అజయ్ కుమార్, డాక్టర్ శ్రీహరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్, వైవీ, ధర్మారెడ్డి ప్రమాణం చేయాలి

తిరుమల, న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి వ్యవహారంలో తిరుమలకు వచ్చి ప్రమాణం చేయాల్సింది భూమన కరుణాకర్‌రెడ్డి కాదని, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ అన్నారు. మంగళవారం ఉదయం శ్రీవారి దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తితిదే ఛైర్మన్‌గా భూమన ఉన్నది 9 నెలలు మాత్రమేనని.. మిగతా కాలం మొత్తం తితిదే ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి, ఈవోగా ధర్మారెడ్డిలే ఉన్నారని వారి హయాంలోనే దేవుడిని వాడుకుని రాజకీయాలు చేశారని ఆరోపించారు. ఇంజినీరింగ్ పనుల్లో కమిషన్ తీసుకున్నారా లేదా అనే దానిపై కరుణాకర్‌రెడ్డి ప్రమాణం చేయాలన్నారు. కల్తీ నెయ్యితో చేసిన లడ్డూ, వడ ప్రసాదాలను ఎంతో మందికి తన చేతులతో ఇచ్చానని, తెలియక తన వల్ల జరిగిన తప్పుని క్షమించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీక్షకు సంఘీభావంగా తాను 11 రోజుల దీక్ష చేస్తున్నానని తెలిపారు. అఖిలాండం వద్ద నెయ్యి కల్తీకి కారకులైన వారిని శిక్షించమని కర్పూరం వెలిగించి, కొబ్బరికాయ కొట్టారు. పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపేశారు.



ఆలయం ఎదుట లడ్డూ ప్రసాదం, వడతో కిరణ్‌రాయల్

ప్రాధాన్య రంగాలకు రుణాలివ్వండి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: బ్యాంకర్లు వ్యవసాయం, విద్య, ఎంఎస్ఎంఈ తదితర ప్రాధాన్య రంగాలకు రుణాలు మంజూరు చేయాలని ఎంపీ గురుమూర్తి, జేసీ శుభం భన్సల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నాబార్డ్ డీడీఎం సునీల్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, మెప్మా పీడీ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ శుభం భన్సల్, చిత్రంలో ఎంపీ గురుమూర్తి తదితరులు

హైదరాబాద్-తిరుపతి విమానంలో సాంకేతిక సమస్య

శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

ఈనాడు- హైదరాబాద్, శంషాబాద్-న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి తిరుపతి బయల్దేరిన విమానం సాంకేతిక లోపం కారణంగా తిరిగి శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండైంది. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటన రెండు గంటలపాటు ఉత్కంఠ కలిగించింది. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా విమానాన్ని దింపడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాశ్రయ అధికారులు, ప్రయాణికుల కథనం మేరకు.. అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతికి ఉదయం 6.35 గంటలకు 66 మంది ప్రయాణికులతో బయలుదేరింది. 30 నిమిషాలు ఆకాశంలో ప్రయాణించి.. ఉమ్మడి కడప జిల్లా ఒంటిమిట్ట పరిసర ప్రాంతానికి చేరుకున్న సమయంలో ఏసీ జనరేటర్‌లో సాంకేతిక లోపం చోటుచేసుకుంది. గుర్తించిన పైలట్ వెంటనే శంషాబాద్ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు వెనక్కి వచ్చిన ఆ విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. సాంకేతిక లోపాన్ని సరిచేసేందుకు ఇంజినీరింగ్ నిపుణులు యత్నించగా ఫలితం లేకపోయింది. అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రయాణికులను మధ్యాహ్నం మరో విమానంలో తిరుపతికి పంపినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

పొగాకు వినియోగ నిర్మూలన కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయాలో ఏర్పాటు చేసిన పొగాకు వినియోగ నిర్మూలన కేంద్రాన్ని న్యూదిల్లీ నుంచి వర్చువల్‌గా కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ ప్రారంభించారు. ఈ కేంద్రం రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలందిస్తుందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ రాధ తెలిపారు. కేంద్రం ఇన్‌ఛార్జి హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు. స్విమ్స్‌లోనూ ఈ తరహా కేంద్రాన్ని ప్రారంభించారు.



రుయాలో శిలాఫలకం వద్ద ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ తదితరులు

తిరుమలలో భారీ జెర్రిపోతు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని ప్రైవేటు అతిథిగృహం వద్ద భారీ జెర్రిపోతు మంగళవారం కలకలం సృష్టించింది. స్థానిక లలిత సత్యమ్మ నిలయం సమీపంలో పాము వచ్చినట్లు నిర్వాహకులు తితిదే అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకు సమాచారం అందించారు. ఆయన అక్కడకు చేరుకుని చాకచక్యంగా 10 అడుగుల భారీ పామును పట్టుకుని అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.



విశాఖ బాలుడు.. తిరుపతిలో అప్పగింత

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనం కోసం విశాఖ నుంచి తిరుపతికి వచ్చి ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించారు. తిరుపతి పడమర పీఎస్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన ఎం.నిరంజన్‌రావు కుమారుడు సుశాంత్(13) విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం తండ్రి హాస్టల్‌కు వచ్చి కుమారుడుని చూసి కొంత డబ్బు ఇచ్చాడు. సోమవారం ఉదయం తండ్రి, హాస్టల్‌లో ఎవరికీ చెప్పకుండా బాలుడు బయటకు వచ్చాడు. శ్రీవారి దర్శనం చేసుకోవాలని విశాఖపట్టణం రైల్వే స్టేషన్‌కు వెళ్లి తిరుపతికి వచ్చే రైలు ఎక్కాడు. సోమవారం అర్ధరాత్రి పైన తిరుపతికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అలిపిరి చేరుకుని ఒంటరిగా తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. గత నెల కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం చేసుకున్నానని.. మరోసారి తిరుమలకు రావాలనే కోరికతో వచ్చినట్లు పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి తండ్రికి సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి తిరుపతికి వచ్చిన తండ్రి నిరంజన్‌రావుకు బాలుడిని అప్పగించారు.



తండ్రితో సుశాంత్

నగరపాలిక ఇంజినీరింగ్ విభాగంలో బదిలీలు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక కార్యాలయ ఇంజినీరింగ్ విభాగంలో బదిలీల ప్రక్రియ దాదాపుగా ముగిసింది. ఎస్ఈ మోహన్‌ను నెల్లూరు ఎంఈలు చంద్రశేఖర్‌ను చుడా, వెంకట్రామిరెడ్డిని చిత్తూరుకు బదిలీ చేశారు. డీఈ సంజీవకుమార్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ డీఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి నుంచి ఆర్.లలితను నియమించారు. మరో డీఈ ఎ.విజయ్‌కుమార్‌రెడ్డిని కల్యాణదుర్గం మున్సిపల్ డీఈగా బదిలీ చేయగా.. ఆయన స్థానంలో చిత్తూరు నగరపాలిక నుంచి రమణను నియమించారు. తిరుపతి నగరపాలికకు చెందిన డీఈ శ్రావణి చిత్తూరు నగరపాలక సంస్థ డీఈగా బదిలీ కాగా అక్కడి నుంచి వెంకటప్రసాద్ తిరుపతికి వచ్చారు. డీఈ రవీంద్రరెడ్డి నగరికి బదిలీ కాగా ఆయన స్థానంలోకి మధుకుమార్ నంద్యాల నుంచి వస్తున్నారు. నగరపాలిక ఇన్‌ఛార్జి డీఈ(ఎలక్ట్రికల్) నరేంద్రకుమార్ రాజంపేట మున్సిపల్ ఏఈగా బదిలీ కాగా రాజంపేట నుంచి ఏఈగా శిల్ప తిరుపతికి బదిలీ అయ్యారు.

వేరుసెనగ గింజ గొంతులో ఇరుక్కొని చిన్నారి మృతి

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం మల్లంగుంట పంచాయతీ పరిధిలోని వినాయక నగర్‌కు చెందిన రాజేష్, జయంతిల మూడునెలల కుమార్తె గొంతులో వేరుసెనగ గింజ ఇరుక్కుని మృతిచెందింది. శనివారం పాపను వరండాలో పడుకోబెట్టగా. . ఆ సమయంలో పక్కింటికి చెందిన మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ వచ్చి తాను తింటున్న వేరుసెనగ గింజను పాప నోట్లో వేసి తినమని చెప్పడంతో పాప గొంతులో అడ్డుపడింది. ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటుండటంతో పాప తల్లి వెంటనే స్పందించి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లింది. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది.

నెయ్యి సేకరణకు స్థానికంగానే వనరులు సృష్టించాలి

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: నెయ్యి సేకరణకు స్థానికంగానే వనరులు సృష్టించుకుంటే బయటి ప్రాంతాల వారిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని.. తితిదే అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన మహాదేవ ధర్మపీఠం పీఠాధిపతి మహాదేవ్ స్వామిజీ కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై యావత్ హిందూ లోకం ఆందోళనకు గురైందన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాలలోని పేదలకు ఆవులను అందించి.. తద్వారా నెయ్యిని తయారు చేసుకోవచ్చని, స్థానికంగా ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చన్నారు. కల్తీ నెయ్యి వెనుక ఎంతటి వారున్నా శిక్షించాలని కోరారు.



సమావేశంలో మహాదేవ్ స్వామిజీ తదితరులు

తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తిరుమల వన్‌టౌన్ పీఎస్ సీఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. స్థానిక రాంభగీచా సమీపంలోని వినాయకుడి గుడి వద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ఈ నెల 19వ తేదీన తితిదే అశ్విని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని ఆచూకీ కోసం ఆధార్‌కార్డ్ పరిశీలించగా చిరునామా తప్పుగా ఉన్నట్లు గుర్తించారు. తిరుమలలో మేస్త్రీ పనులు నిర్వహించేందుకు వచ్చి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

ఆచార్యులకు మెమోలు?

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ ఎంసీఏ విభాగంలో మంగళవారం వర్సిటీ వీసీ అప్పారావు తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో విద్యార్థులు మాత్రమే తరగతి గదుల్లో ఉండడాన్ని గమనించారు. అధ్యాపకులు లేకపోవడంపై ఆయన కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ అడిగారు. ఈ మేరకు తరగతులకు హాజరు కాని అధ్యాపకులకు మెమోలు ఇవ్వనున్నట్లు తెలిసింది.

పీజీ ఫలితాల విడుదల

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జులైలో ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, అప్లైడ్ మ్యాథమెటిక్స్, ఎంకాం నాలుగో సెమిస్టర్.. మార్చిలో ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు మంగళవారం తెలిపారు. ఎస్వీయూ వెబ్‌సైట్‌లో ఫలితాలు తెలుసుకోవచ్చన్నారు.

15 మంది ఎర్ర దొంగల అరెస్ట్

జీవకోన (తిరుపతి), న్యూస్‌టుడే: టాస్క్‌ఫోర్స్ బలగాలు రాజంపేట అడవిలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో పెద్దఎత్తున స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ కథనం మేరకు.. రాజంపేట అటవీ ప్రాంతం పరిధి సుండుపల్లె సమీపంలోని కొలిమిమిట్ట ప్రాంతంలో నాలుగు కార్లలో వచ్చిన స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించేందుకు యత్నించారు. గస్తీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బలగాలు చుట్టుముట్టి 15 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు అన్నమయ్య జిల్లాకు చెందినవారుగా, 11 మంది తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. నాలుగు కార్లు, ద్విచక్రవాహనం, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు.



అరెస్ట్ చేసిన స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ బలగాలు

బంగారం చోరీ కేసులో నిందితునికి జైలు

తిరుపతి (లీగల్): తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన బంగారు నగల చోరీ కేసులో బెంగళూరుకు చెందిన ఎంజీ వినోద్‌కు ఆరు నెలలు జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు వెలువరించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	122
రిటైల్	144
లేయర్	115
బ్రాయిలర్స్	209
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	238
లేయర్ మాంసం	195

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

వైద్యుల చీటీ లేనిదే మందులు విక్రయించొద్దు

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఈ నెల 18న 'ఈనాడు'లో 'మత్తుకు మరోరూపం' శీర్షికన వెలువడిన కథనంపై పోలీసులు స్పందించారు. మంగళవారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ పి. సుబ్బరామిరెడ్డి మండలంలోని ఆర్‌ఎంపీ వైద్యులు, మెడికల్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. వైద్యుల చీటీ లేనిదే మందులు విక్రయించొద్దని చెప్పారు.

స్పందనకు వందనం

వెలిగిన దీపాలు

తిరుపతి(నగరపాలిక): 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు కమిషనర్ మౌర్య స్పందించారు. పద్మావతి పార్కులోని పనిచేయని విద్యుత్ దీపాలకు మరమ్మతు చేయించారు.

అనధికారిక లేఅవుట్లపై చర్యలు

తిరుపతి(నగరపాలిక): తుడా పరిధిలో అనధికారిక లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. లేఅవుట్లలో సౌకర్యాలను ఆమె అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంపై సమీక్ష

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టుల్లో పనులు ప్రారంభం కాని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం గురించి స్మార్ట్‌సిటీ వార్షిక సమావేశంలో అధికారులు, సభ్యులు సమీక్ష నిర్వహించారు. స్మార్ట్‌సిటీ ఎండీ హోదాలో నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వర్చువల్ విధానంలో ఛైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, నగరపాలక అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటులో చోటు చేసుకుంటున్న జాప్యానికి గల కారణాలను సభ్యులకు అధికారులు వివరించారు. వార్షిక బడ్జెట్‌పై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, చిత్రంలో కూటమి నాయకులు

ప్రజలకు పారదర్శక పాలన

తిరుపతి (నగరం, నగరపాలిక), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలన అందిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక రైల్వే కాలనీలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు మునిశేఖర్‌రాయల్, పుష్పావతి, మన్యం శ్రీనివాసులు, ఆర్సీ శ్రీనివాసులు, ఊట్ల సురేంద్రనాయుడు, మహేష్‌యాదవ్, పొలకల మల్లికార్జున్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం.. మహిళా వర్సిటీ: శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో నూతన విద్యార్థి సంఘం ప్రారంభోత్సవం జరిగింది.

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే! అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.


కొరటాల శివ

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని నెగెటివ్‌గా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు?

"మనిషికి ధైర్యం అవసరమే కానీ మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి, విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినపుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్ట్. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాను మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?

"జాన్వీ చాలా ప్రతిభావంతురాలు. తొలి రోజు సీన్ పూర్తయ్యాకనే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. కథ రాసుకున్నప్పుడే భైరా పాత్రకు సైఫ్ అయితేనే సరిపోతారనిపించింది. ఎంతో మంది లెజెండ్ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం కష్టపడ్డారు".

ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. నిర్మాతలకు లాభాలు రావాలని అన్ని కోణాల్లో చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".

ఈనాడు సినిమా



ఎర్ర మందారం... మెరుపు సింగారం

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్య రాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్రమందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలిసారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై ఆకట్టుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర


సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటు"న్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర సెకండ్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేరణ రూపొందిస్తున్నారు" అన్నారు.

రోమ్‌ను కాపాడేందుకు 'గ్లాడియేటర్' పోరు



మరిన్ని విశేషాలు www.eenadu.net లో


సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, సురేశ్‌బాబు

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం

"'ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకమైన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెరపైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బావ..బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి అందమైన చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, ప్రశాంత్ వర్మ, డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం


హసిత్ గోలి

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 4న రానున్న నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.

★ "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి".

★ "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం".

★ "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి".


శ్రీహర్ష, కషిక కపూర్

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది" అన్నారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన సదస్సు.. తిరుపతి(బైరాగిపట్టెడ): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 'స్కోప్ ఆఫ్ ఇంటర్ డిస్పెన్సరీ రీసెర్చ్ ఇన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టం' జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా కేంద్రీయ సంస్కృత విద్యాలయం వీసీ శ్రీనివాస్ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు.

ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి(బైరాగిపట్టెడ): ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ఎస్వీయూలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ర్యాలీ చేపట్టారు. కోఆర్డినేటర్ దామోదరం, కోఆర్డినేటర్లు రమేష్ బాబు, శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు. ✷ తితిదే ఆధ్వర్యంలోని ఎస్వీ ఓరియంటల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ సీతారామారావు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, హేమంత్ కుమార్, అనిల్‌కుమార్, రాజశేఖర్, అన్నపూర్ణ పాల్గొన్నారు. ✷ తితిదే ఎస్వీ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ విభాగ అధికారి కృష్ణ కిషోర్, ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు. ✷ మహిళా వర్సిటీ: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మొక్కలు నాటారు. ఇన్‌ఛార్జి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఎస్వీయూలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంగళం(తిరుపతి): జాతీయస్థాయి జూడో పోటీలకు మంగళంలోని ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సి.భావన ఎంపికైంది. పాఠశాలలో మంగళవారం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

నదులను పరిరక్షించాలి

తిరుపతి(మహిళా వర్సిటీ): జీవకోటికి జీవనాధారమైన నదులను పరిరక్షించాలని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ పేర్కొన్నారు. ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల భూగోళశాస్త్ర విభాగం, 5ఏ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు.

వసతుల కల్పనకు సహకరించండి

తిరుపతి(బైరాగిపట్టెడ): తితిదే ఉద్యోగులకు పాదిరేడు వద్ద తితిదే ఇళ్ల స్థలాలు కేటాయించిందని, ఆ స్థలాల్లో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను మంగళవారం తితిదే ఐకాస, ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ నేతలు కోరారు. అలాగు దేవస్థానం ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావుని కలిసి విన్నవించారు.

సౌకర్యమైన ప్రయాణం అందించాలి

తిరుపతి(ఆర్టీసీ): శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోనే డీపీటీవో కార్యాలయంలో జిల్లాలోని వివిధ సిస్టం సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు.

స్థలాక్రమణపై ఫిర్యాదు

తిరుపతి(నగరపాలిక): నగరపాలక సంస్థ పరిధిలోని పోస్టల్ కాలనీ ఐదో క్రాస్ రోడ్డులో తమకు చెందిన స్థలాన్ని ఓ వ్యక్తి అనధికారికంగా ఆక్రమించుకుంటున్నట్లు అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ ఆర్.తిప్పారెడ్డి నగరపాలిక అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రామ అవసరాలకు వినియోగించండి

భాకరాపేట: భాకరాపేటలో సర్వే నంబర్ 329లో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకు మాత్రమే వినియోగించాలంటూ వైస్ ఎంపీపీ సునీత ఆధ్వర్యంలో స్థానికులు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

గంజాయి పట్టివేత

రేణిగుంట, న్యూస్‌టుడే: స్థానిక సంత గేటు వద్ద రెండు కిలోల 300 గ్రాముల గంజాయిని గాజుల మాండ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి నిఘా ఉంచి మహమ్మద్ అనీష్, సాయి ప్రకాష్ ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

వైకాపా పాలనలో మాఫియాకు పాలక మండలి సభ్యులుగా అవకాశం

దొడ్డిదారిన ఈవోగా వచ్చిన ధర్మారెడ్డి: నారాయణ



తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: వైకాపా పాలనలో తితిదే పాలక మండలి సభ్యులుగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాఫియాను సభ్యులుగా నియమించారని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ ఆరోపించారు. తితిదేను అపవిత్రం చేసిన ఘనత నాటి ఈవో ధర్మారెడ్డికే దక్కిందన్నారు. అర్హత లేకపోయిన ఆయన్ని దొడ్డిదారిన తితిదే ఈవోగా నియమించారని విమర్శించారు. మంగళవారం తిరుపతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. 'అతి తక్కువ ధరకు నెయ్యి కొనుగోలు చేయడం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొంది. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీయడం బాధాకరం. నందిని లాంటి నెయ్యిని కొనుగోలు చేయడంపై తితిదే దృష్టి సారించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ వల్ల ఏమిటంటి ప్రయోజనం లేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి అనుకూలంగా సిట్ రిపోర్టు ఇవ్వడం సర్వసాధారణం. దేశంలో వామపక్ష శక్తులను అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడం తగదు. దేశంలో నరేంద్రమోదీని ప్రజలంతా తిరస్కరించారు. కేవలం నారా చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్ సహకారంతోనే ప్రభుత్వం నడుస్తోంది' అని అన్నారు.

కష్టపడ్డవాళ్లకే పదవులు

పలు కార్పొరేషన్లలో జిల్లా వాసులకు చోటు



డాక్టర్ పారి చందన స్రవంతి | గంగాధర శ్రీరామదాస్ | పరసా వెంకటరత్నం

ఈనాడు డిజిటల్, తిరుపతి: నిరీక్షణ, ఉత్కంఠకు తెరదించుతూ కూటమి ప్రభుత్వం మంగళవారం పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. తొలి నుంచి పార్టీ పట్ల విధేయత, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉన్న వ్యక్తులకే ఈ జాబితాలో పెద్దపీట వేశారు. తిరుపతి జిల్లాకు చెందిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడుకు కీలకమైన శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలప్పగించారు. వివిధ కార్పొరేషన్లలో సభ్యులుగా జిల్లా నాయకత్వానికి చోటులభించింది. తిరుపతికి చెందిన డాక్టర్ పారీ చందనస్రవంతిని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ సభ్యురాలిగా నియమించారు. ఆమె తండ్రి చిత్తూరు జడ్పీ మాజీ ఛైర్మన్‌గా పనిచేశారు. 2024 ఎన్నికల్లో బాగంగా సత్యవేడు నుంచి కూటమి అభ్యర్థిగా పోటీచేసేందుకు యత్నించారు. ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి సంస్థ సభ్యునిగా వెంకటగిరికి చెందిన గంగాధర శ్రీరామదాస్‌ను నియమించారు. ఆయన తెదేపా వెంకటగిరి పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

తిరుపతి(నగరం): రాష్ట్ర ఆర్థిక సహకార, మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్‌గా తిరుపతికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు ఊకా విజయకుమార్ నియమితులయ్యారు. గతంలో ఆయన కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. తిరుపతి నుంచి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు పోటీ చేయడంతో ఆయన తరఫున ప్రచారంలో పాల్గొన్నారు.

నాయుడుపేట: గొట్టిప్రోలు గ్రామానికి చెందిన మాజీ మంత్రి పరసా వెంకటరత్నం రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన 1994, 1999, 2009లో తెదేపా నుంచి సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1995లో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చిస్తున్న తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేయండి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేయాలని తితిదే అధికారులను దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. స్థానిక అతిథిగృహంలో బ్రహ్మోత్సవాలపై తితిదే అధికారులతో మంత్రి సమీక్షించారు. తితిదే ఈవో జె.శ్యామలరావు బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లపై మంత్రికి వివరించారు. అనంతరం మంత్రికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, డిప్యూటీ ఈవో ఆర్1 భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ తిరుపతి సర్కిల్‌లో బదిలీలు

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: అటవీశాఖ తిరుపతి సర్కిల్ పరిధిలో డీఎఫ్‌వో, సబ్ డీఎఫ్‌వో, కార్యాలయ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. జిల్లా అటవీశాఖ డీఎఫ్‌వోగా పనిచేసిన జి.సతీష్‌రెడ్డి ఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో త్వరలో ఐఎఫ్ఎస్ అధికారిని నియమించనున్నారు. తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎమ్.శివకుమార్ కడప జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న జి.శ్రీనివాసులను నియమించారు. తిరుపతి బయోట్రిమ్ అసిస్టెంట్ స్టేట్ సిల్వికల్చరిస్టుగా, ఎర్రచందనం కేంద్రీయ గోదాముల ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న ఎస్.శివకుమార్ సాంగ్ మంగళగిరిలోని పీసీసీఎఫ్ కార్యాలయంలోని లెన్స్ వింగ్‌కు బదిలీ అయ్యారు. తిరుపతి బయోట్రిమ్ ఏసీఎఫ్‌గా చిత్తూరు సామాజిక అటవీశాఖ డీఎఫ్‌వో కె.సోమశేఖర్ నియమకమయ్యారు. తిరుపతి సబ్ డీఎఫ్‌వోగా పనిచేసిన టి.శ్రీనివాసరావు రాజంపేట ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా కడప ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న ఎమ్.గురుప్రకాశ్ నియమకమయ్యారు. తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తున్న సి.వి.రత్నం అనంతపురం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా నియమకం కాగా, ఆయన స్థానంలో ఏలూరు నుంచి హేమబిందు నియమకమయ్యారు. తిరుపతి జిల్లా అటవీశాఖ కార్యాలయం పరిపాలన అధికారిగా పనిచేస్తున్న అప్పారావు విజయనగరానికి బదిలీ అయ్యారు.

డీఎస్‌వోగా శేషాచలం రాజు

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ జిల్లా సరఫరాల అధికారి(డీఎస్‌వో)గా శేషాచలం రాజు నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా సహాయ సరఫరాల అధికారిగా ఉన్న ఆయన్ను డీఎస్‌వోగా నియమిస్తూ పౌరసరఫరాల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన రాజారామిరెడ్డి కర్నూలు డీఎస్‌వోగా బదిలీ చేశారు. శేషాచలం రాజు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి సహాయ సరఫరాల అధికారిగా, విభజన తర్వాత ఇన్‌ఛార్జి డీఎస్‌వోగా పనిచేశారు.

డీటీల నియామకం

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు ఉప తహసీల్దార్ల(డీటీలు) బదిలీ అయ్యారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.అశోక్ రెడ్డి పుత్తూరుకు బదిలీ అయ్యారు. నూతన ఉప తహసీల్దార్‌గా కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న బి.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల ఉప తహసీల్దార్‌గా జి.రామచంద్ర, రీ-సర్వే ఉప తహసీల్దార్‌గా సి.జీవన్‌కుమార్, ఎంఆర్ఐగా జి.కృష్ణమ్మను నియమిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులకు ఆర్థికంగా అండగా నిలవాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రైతులకు ప్రభుత్వాలు ఆర్థికంగా అండగా నిలవాలని, ఫార్మర్ క్రెడిట్ విధానాలను అమల్లోకి తీసుకువస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి కోరారు. బలరామ జయంతిని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీశుకబ్రహ్మాశ్రమం ఆవరణలో మంగళవారం సంఘం నేతృత్వంలో రైతు సమావేశం జరిగింది. కార్యక్రమాన్ని మదురకు చెందిన శ్రీశర్వానంద్ స్వామీజీ, శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి శ్రీసంపూర్ణానందగిరి సంయుక్తంగా ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ రైతులు 15 మందిని సత్కరించారు. కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీపురం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు దశరథాచారి, జయచంద్రనాయుడుతో పాటు పట్టణ ప్రముఖులు కోలా ఆనంద్, అంజూరు తారక శ్రీనివాసులు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలోని శ్రీశుకబ్రహ్మాశ్రమం ఆవరణలో పీఠాధిపతులు, భారతీయ కిసాన్ సంఘం సభ్యులు



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌తో కలిసి వేరుసెనగ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ డా.వెంకటేశ్వర్

తీరం పరిశ్రమల ఏర్పాటుకు వరం

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని తీర ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉండటం వరమని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. ఏరూరు పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించిన 'ప్రజా వేదిక'లో స్థానిక ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే తీర గ్రామాల్లో వివిధ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, త్వరలో క్రిస్ సిటీ పేరిట మరికొన్ని నెలకొల్పేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నామని స్థానిక ప్రజలు కలెక్టర్‌కు ఏకరవు పెట్టారు. మజరా గ్రామమైన అల్లీపురంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు చేశారు. వ్యవసాయశాఖ జేడీ ప్రసాద్, డీఎల్‌డీవో వాణిరెడ్డి, సర్పంచి కామాక్షి, జడ్పీటీసీ సభ్యుడు శీనయ్య, తెదేపా నేతలు పాల్గొన్నారు.

జగన్, వైవీ, ధర్మారెడ్డి ప్రమాణం చేయాలి



ఆలయం ఎదుట లడ్డూ ప్రసాదం, వడతో కిరణ్‌రాయల్

తిరుమల, న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి వ్యవహారంలో తిరుమలకు వచ్చి ప్రమాణం చేయాల్సింది భూమన కరుణాకర్‌రెడ్డి కాదని, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ అన్నారు. మంగళవారం ఉదయం శ్రీవారి దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తితిదే ఛైర్మన్‌గా భూమన ఉన్నది 9 నెలలు మాత్రమేనని.. మిగతా కాలం మొత్తం తితిదే ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి, ఈవోగా ధర్మారెడ్డిలే ఉన్నారని వారి హయాంలోనే దేవుడిని వాడుకుని రాజకీయాలు చేశారని ఆరోపించారు. ఇంజినీరింగ్ పనుల్లో కమిషన్ తీసుకున్నారా లేదా అనే దానిపై కరుణాకర్‌రెడ్డి ప్రమాణం చేయాలన్నారు. కల్తీ నెయ్యితో చేసిన లడ్డూ, వడ ప్రసాదాలను ఎంతో మందికి తన చేతులతో ఇచ్చానని, తెలియక తన వల్ల జరిగిన తప్పుని క్షమించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీక్షకు సంఘీభావంగా తాను 11 రోజుల దీక్ష చేస్తున్నానని తెలిపారు. అఖిలాండం వద్ద నెయ్యి కల్తీకి కారకులైన వారిని శిక్షించమని కర్పూరం వెలిగించి, కొబ్బరికాయ కొట్టారు. పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపేశారు.

ప్రాధాన్య రంగాలకు రుణాలివ్వండి



మాట్లాడుతున్న జేసీ శుభం భన్సల్, చిత్రంలో ఎంపీ గురుమూర్తి తదితరులు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: బ్యాంకర్లు వ్యవసాయం, విద్య, ఎంఎస్ఎంఈ తదితర ప్రాధాన్య రంగాలకు రుణాలు మంజూరు చేయాలని ఎంపీ గురుమూర్తి, జేసీ శుభం భన్సల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నాబార్డ్ డీడీఎం సునీల్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, మెప్మా పీడీ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆ నలుగురూ క్షమాపణలు చెప్పాలి'

తిరుపతి (భవానినగర్), న్యూస్‌టుడే: తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నాస్తికుడని, ఆయన మునగడంతో పుష్కరిణి కలుషితం అయిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్, మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, న్యాయవాది పొన్నవోలు సుధాకర్ తిరుమలలోని అఖిలాండం వద్ద శ్రీవారి భక్తకోటికి సాష్టాంగ నమస్కారం చేసి క్షమాపణలు చెప్పాలన్నారు. తిరుమలలో భూమన చేసింది ముమ్మాటికి డ్రామానే అని విమర్శించారు. నాయకులు భాస్కర్, అజయ్ కుమార్, డాక్టర్ శ్రీహరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి అండర్-19 స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: అండర్-19 ఉమ్మడి చిత్తూరు స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో సెపక్ తక్రా, సాఫ్ట్‌బాల్, కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 9.30 గంటలకు రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సెపక్ తక్రా, 28న మధ్యాహ్నం 2 గంటలకు చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాఫ్ట్‌బాల్, 30న మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి గ్రామీణం తుమ్మలగుంట క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలు జరుగుతాయని వివరించారు. మరిన్ని వివరాలకు 93936 21004 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పొగాకు వినియోగ నిర్మూలన కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయాలో ఏర్పాటు చేసిన పొగాకు వినియోగ నిర్మూలన కేంద్రాన్ని న్యూదిల్లీ నుంచి వర్చువల్‌గా కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ ప్రారంభించారు. ఈ కేంద్రం రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలందిస్తుందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ రాధ తెలిపారు. కేంద్రం ఇన్‌ఛార్జి హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు. స్విమ్స్‌లోనూ ఈ తరహా కేంద్రాన్ని ప్రారంభించారు.



రుయాలో శిలాఫలకం వద్ద ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ తదితరులు

తిరుమలలో భారీ జెర్రిపోతు



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని ప్రైవేటు అతిథిగృహం వద్ద భారీ జెర్రిపోతు మంగళవారం కలకలం సృష్టించింది. స్థానిక లలిత సత్యమ్మ నిలయం సమీపంలో పాము వచ్చినట్లు నిర్వాహకులు తితిదే అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకు సమాచారం అందించారు. ఆయన అక్కడకు చేరుకుని చాకచక్యంగా 10 అడుగుల భారీ పామును పట్టుకుని అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.

విశాఖ బాలుడు.. తిరుపతిలో అప్పగింత



తండ్రితో సుశాంత్

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనం కోసం విశాఖ నుంచి తిరుపతికి వచ్చి ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించారు. తిరుపతి పడమర పీఎస్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన ఎం.నిరంజన్‌రావు కుమారుడు సుశాంత్(13) విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం తండ్రి హాస్టల్‌కు వచ్చి కుమారుడుని చూసి కొంత డబ్బు ఇచ్చాడు. సోమవారం ఉదయం తండ్రి, హాస్టల్‌లో ఎవరికీ చెప్పకుండా బాలుడు బయటకు వచ్చాడు. శ్రీవారి దర్శనం చేసుకోవాలని విశాఖపట్టణం రైల్వేస్టేషన్‌కు వెళ్లి తిరుపతికి వచ్చే రైలు ఎక్కాడు. సోమవారం అర్ధరాత్రిపైన తిరుపతికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అలిపిరి చేరుకుని ఒంటరిగా తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. గత నెల కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం చేసుకున్నానని.. మరోసారి తిరుమలకు రావాలనే కోరికతో వచ్చినట్లు పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి తండ్రికి సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి తిరుపతికి వచ్చిన తండ్రి నిరంజన్‌రావుకు బాలుడిని అప్పగించారు.

నగరపాలిక ఇంజినీరింగ్ విభాగంలో బదిలీలు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక కార్యాలయ ఇంజినీరింగ్ విభాగంలో బదిలీల ప్రక్రియ దాదాపుగా ముగిసింది. ఎస్ఈ మోహన్‌ను నెల్లూరు ఎంఈలు చంద్రశేఖర్‌ను చుడా, వెంకట్రామిరెడ్డిని చిత్తూరుకు బదిలీ చేశారు. డీఈ సంజీవకుమార్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ డీఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి నుంచి ఆర్.లలితను నియమించారు. మరో డీఈ ఎ.విజయ్‌కుమార్‌రెడ్డిని కల్యాణదుర్గం మున్సిపల్ డీఈగా బదిలీ చేయగా.. ఆయన స్థానంలో చిత్తూరు నగరపాలిక నుంచి రమణను నియమించారు. తిరుపతి నగరపాలికకు చెందిన డీఈ శ్రావణి చిత్తూరు నగరపాలక సంస్థ డీఈగా బదిలీ కాగా అక్కడి నుంచి వెంకటప్రసాద్ తిరుపతికి వచ్చారు. డీఈ రవీంద్రరెడ్డి నగరికి బదిలీ కాగా ఆయన స్థానంలోకి మధుకుమార్ నంద్యాల నుంచి వస్తున్నారు. నగరపాలిక ఇన్‌ఛార్జి డీఈ(ఎలక్ట్రికల్) నరేంద్రకుమార్ రాజంపేట మున్సిపల్ ఏఈగా బదిలీ కాగా రాజంపేట నుంచి ఏఈగా శిల్ప తిరుపతికి బదిలీ అయ్యారు.

వేరుసెనగ గింజ గొంతులో ఇరుక్కొని చిన్నారి మృతి

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం మల్లంగుంట పంచాయతీ పరిధిలోని వినాయక నగర్‌కు చెందిన రాజేష్, జయంతిల మూడునెలల కుమార్తె గొంతులో వేరుసెనగ గింజ ఇరుక్కుని మృతిచెందింది. శనివారం పాపను వరండాలో పడుకోబెట్టగా. . ఆ సమయంలో పక్కింటికి చెందిన మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ వచ్చి తాను తింటున్న వేరుసెనగ గింజను పాప నోట్లో వేసి తినమని చెప్పడంతో పాప గొంతులో అడ్డు పడింది. ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటుండటంతో పాప తల్లి వెంటనే స్పందించి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లింది. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది.

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ

తొట్టంబేడు, న్యూస్‌టుడే: విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో భారీగా బంగారు, వెండి అభరణాల చోరీ జరిగింది. ఈ ఘటన శ్రీకాళహస్తి రెండో పట్టణ పరిధిలోని కొత్తపేట, హరహర బావి వీధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు. . ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి నరహింహమూర్తి దంపతులు ఆదివారం ఇంటికి తాళాలు వేసి తిరుపతిలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం గుర్తించిన దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్న దంపతులు తాళం తీసి ఉండటంతో అనుమానం వచ్చి ఆభరణాలను పరిశీలించగా చోరీకి గురైనట్లు గుర్తించారు. మంగళవారం క్లూస్‌టీం, వేలిముద్రల నిపుణులు తనిఖీ చేశారు. 134 గ్రాముల బంగారు, 1050 గ్రాముల వెండితో కలిపి సుమారు రూ.10 లక్షల విలువైన ఆభరణాలు దుండగులు అపహరించినట్లు గుర్తించామన్నారు. బాధితుడు నరహింహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బంగారం చోరీ కేసులో నిందితునికి జైలు

తిరుపతి (లీగల్): తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన బంగారు నగల చోరీ కేసులో బెంగళూరుకు చెందిన ఎంజీ వినోద్‌కు ఆరు నెలలు జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు వెలువరించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులను చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

ఏర్పేడు, న్యూస్‌టుడే: పెద్దఎత్తున గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. ఏర్పేడు సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి కూడలిలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని పరిశీలించగా ప్లాస్టిక్ సంచిలో 22 కిలోల 250 గ్రాముల గంజాయిని గుర్తించారు. నిందితులు తిరుపతికి చెందిన నరసింహ రోహిత్, ఏర్పేడు మండలంలోని మన్నసముద్రానికి చెందిన నవీన్‌గా వెల్లడించారు. రెండు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు, రూ.9వేలు నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

15 మంది ఎర్ర దొంగల అరెస్టు



అరెస్ట్ చేసిన స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ బలగాలు

జీవకోన (తిరుపతి), న్యూస్‌టుడే: టాస్క్‌ఫోర్స్ బలగాలు రాజంపేట అడవిలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో పెద్దఎత్తున స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ కథనం మేరకు.. రాజంపేట అటవీ ప్రాంతం పరిధి సుండుపల్లె సమీపంలోని కొలిమిమిట్ట ప్రాంతంలో నాలుగు కార్లలో వచ్చిన స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించేందుకు యత్నించారు. గస్తీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బలగాలు చుట్టుముట్టి 15 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు అన్నమయ్య జిల్లాకు చెందినవారుగా, 11 మంది తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. నాలుగు కార్లు, ద్విచక్రవాహనం, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు.

సహజీవనం.. మనస్పర్థలతో మహిళ హత్య

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో ఓ మహిళను కర్రతో కొట్టి హత్య చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామీణ సీఐ కిషోర్ బాబు వివరాల మేరకు.. చెన్నూరులోని శెట్టిగారిబీటు ప్రాంతంలో ఆనందమ్మ, రమేష్ కొన్నేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఆనందమ్మకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆనందమ్మ తన బంధువుల అమ్మాయితో రమేష్‌కు వివాహం జరిపించారు. అయినా రమేష్, ఆనందమ్మలు కుటుంబ సభ్యులను వదిలేసి చెన్నూరులో ఇళ్లు తీసుకొని ఉంటున్నారు. వారి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు రావడంతో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో నిద్రిస్తున్న ఆనందమ్మ(42)ను రమేష్ కర్రతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కేసు, నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు రమేష్ పరారీలో ఉన్నాడు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	122
రిటైల్	144
లేయర్	115
బ్రాయిలర్స్	209
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	238
లేయర్ మాంసం	195

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు



పోలేరమ్మ జాతర సందడి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వెంకటగిరిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పోలేరమ్మ జాతరను కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని బి.పి.అగ్రహారం వద్ద బస్సులు నిలిపే ప్రదేశాన్ని వెంకటగిరి బస్సుడుగా పిలుస్తారు. పోలేరమ్మ జాతర సందర్భంగా ఇక్కడి ఆర్టీసీ సిబ్బంది మంగళవారం ముగ్గులు వేసి బస్టాండు ఆవరణాన్ని ఎంతో సుందరంగా అలంకరించడం విశేషంగా సంతరించుకుంది.

కాలభైరవునికి విశేష అభిషేకాలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన కాలభైరవస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మంగళవారంతో పాటు అష్టమి తిథి కలిసి రావడంతో స్వామి వారికి గోక్షీరంతో పాటు విశేష పూజా ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. ధూప, దీప, నివేదనాది కైంకర్యాలు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తికి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.





లబ్ధిదారులకు నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

బ్రాహ్మణుల సంక్షేమం తెదేపా లక్ష్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బ్రాహ్మణుల సంక్షేమాన్ని తెదేపా లక్ష్యంగా చేసుకుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలోని ఊరందూరులో మంగళవారం బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా లబ్ధిదారులకు నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలైన బ్రాహ్మణులకు తెదేపా అండగా ఉంటుందని పేర్కొన్నారు. వాళ్ల అభ్యున్నతికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. రేణిగుంట సమీపంలో బ్రాహ్మణ సేవా సంఘం తరఫున కార్యక్రమాల నిర్వహణకు కొంత మేర స్థలాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సాధికారిక సేవా సమితి జిల్లా సమన్వయకర్త చిత్తర్వు హనుమంతరావు, సురేష్‌కుమార్, మధుసూదన్‌శర్మ, కృష్ణమూర్తి, కుమార్, జనార్దన్‌శర్మ పాల్గొన్నారు. **తొట్టంబేడు :** ప్రజలు ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన సాగిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పొయ్య గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. గ్రామ సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. అనంతరం పొలం పిలుస్తోంది గోడ పత్రికలను ఆవిష్కరించారు.



అద్దె భవనంలోనే కొనసాగుతున్న రెండో పట్టణ పోలీసు స్టేషన్



శ్రీశీతలాంబ ఆలయం వద్ద అర్ధాంతరంగా నిలిచిన భవనం

నిధుల్లేక.. పనులు సాగక

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనాల్లో కొనసాగడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం డీఎస్పీ కార్యాలయం, రెండో పట్టణ పోలీసు స్టేషన్ రెండూ ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. వీటికి పక్కా భవనాలు అందుబాటులోకి తీసుకురావాలని గత తెదేపా ప్రభుత్వ హయాం నుంచి సన్నాహాలు జరుగుతూనే ఉన్నాయి. తొట్టంబేడు పోలీసు స్టేషన్ పక్కన ఖాళీ స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రణాళికలు సిద్ధం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక 2019లో ఇక్కడి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు.

రూ.1.80 కోట్ల వ్యయం

అద్దె ఇక్కట్లు తప్పించాలన్న ఉద్దేశంతో రూ.1.80 కోట్లు అంచనా వ్యయంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏళ్లు గడిచిపోతున్నా పనులు సకాలంలో సాగలేదు. దీనికి తోడు నిర్మాణం చేపట్టిన గుత్తేదారులకు బిల్లులు అందని కారణంగా పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన నిలిచిపోయాయి. ఈ విషయమై పోలీసు అధికారులు, పాలకులు ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో పనులు ముందుకు సాగలేదు.

ప్రజల సౌలభ్యమే లక్ష్యం

ప్రజల సౌలభ్యం ప్రధాన లక్ష్యంగా పోలీసు స్టేషన్‌లు వీలైనంత వరకు ఒకే దగ్గర ఉండేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగానే ప్రస్తుతం తొట్టంబేడు, శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసు స్టేషన్లకు సమీపంలోనే డీఎస్పీ కార్యాలయం, రెండో పట్టణ పోలీసు స్టేషన్ భవనాలు నిర్మించాలని సంకల్పించారు. ఈ నేపథ్యంలోనే పనులు ప్రారంభించారు. వైకాపా హయాంలో ఆగిపోయిన పనులు మళ్లీ ప్రారంభించి వీలైనంత త్వరలో నిర్మాణంలో ఉన్న భవనాలను పూర్తి చేయించేందుకు ప్రస్తుత ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ త్వరలోనే పనులు ప్రారంభించే దిశగా సబ్‌డివిజనల్ స్థాయి అధికారి ప్రయత్నిస్తుండటం విశేషం. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న తొట్టంబేడు పోలీసు స్టేషన్ నూతన భవనం నిర్మించాలన్న తలంపుతో పోలీసు ఉన్నతాధి కారులున్నారు. ఇందుకు స్థలాన్ని ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం.

స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ

రేణిగుంట, న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయిలో జరిగిన 68 స్కూల్ గేమ్స్ పోటీల్లో తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి విజయాలు సాధించారని రాష్ట్ర గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరిబాబు తెలిపారు. మంగళవారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో 600, 800, 1500 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.



పూజల్లో వినుత, జనసేన కార్యకర్తలు

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

శ్రీకాళహస్తిగ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: తితిదేలో నెయ్యి కల్తీని నిరసిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత దీక్ష నిర్వహించారు. తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భర్త చంద్రబాబు, జనసేన కార్యకర్తలతో కలసి పూజలు చేపట్టారు. గోవిందనామ స్మరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో దీక్ష కొనసాగించారు. ఆలయాన్ని అపవిత్రంగా మార్చి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వైకాపా నేతలను కఠినంగా శిక్షించాలని కోరారు. పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలతో చాకిరి .. సత్యవేడు : మండలంలోని కన్నావరం పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ముగ్గురు విద్యార్థుల చేత పనులు చేయించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో మంగళవారం వైరల్‌గా మారింది. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



తీరం.. శుభ్రం

ఎంతో ప్రాభవం కల్గిన సువర్ణముఖి నది ప్రాశస్త్యం భక్తులందరికీ తెలియజేయాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నదీ తీర ప్రాంతాన్ని శుభ్రం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ముక్కంటి ఆలయం నుంచి ఆనకట్ట వద్ద రెండు వైపులా నదీ తీర ప్రాంతం పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నదీ తీర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలన్నీ తొలగించారు. ప్రధానంగా రామసేతుకు ఇరువైపులా ఎప్పుడూ దుర్గంధంగా ఉంటూ ఉన్న ప్రాంతం పరిశుభ్రం చేయడంతో పాటు వ్యర్థాలు పడేస్తే జరిమానాలు విధించే విధంగా సూచికలు ఏర్పాటు చేయించారు. స్నానఘట్టాల వద్ద ఉన్న వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసే పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే ఈ పనులు నీటిపారుదలశాఖ, ముక్కంటి ఆలయం, పురపాలక సంఘం శాఖలు నిర్వహించడం లేదు. ఎమ్మెల్యే సూచనతో సొంతంగా ఈ పనులు శ్రేణులు నిర్వహించడం విశేషం. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**



2కే రన్ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, శ్రీసిటీ పోలీసులు

మత్తు, సైబర్ నేరాలపై 2కే రన్

శ్రీసిటీ(వరదయ్యపాళెం),న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని.. శిరస్త్రాణం, మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన నిమిత్తం శ్రీసిటీ-ట్రిపుల్‌ఐటీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శ్రీసిటీ పోలీసులు 2కే రన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డీఎస్పీ పైడేశ్వరరావు, సీఐ బీవీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, శిరస్త్రాణం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఎస్సై హరిప్రసాద్, ట్రిపుల్ ఐటీ కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'గా గుర్తింపు

నారాయణవనం : రాష్ట్రాభివృద్ధికి పేదల సంక్షేమానికి కట్టుబడి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మండల తెదేపా అధ్యక్షుడు భాస్కరన్ అన్నారు. నారాయణవనం మేజర్ పంచాయతీ బీసీ కాలనీ, అరణ్యంకండ్రిగ పంచాయతీలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి ప్రజలకు కరపత్రాలు పంచారు. నాయకులు హరి, పరశురామయ్య, శ్రీనివాసులు, కందస్వామినాయుడు, రామ్మూర్తి నాయుడు, జయచంద్రనాయుడు, చంద్రశేఖర్ నాయుడు, భాస్కర్ నాయుడు, ఆర్ముగం, ముని బాబు, రాము, మురుగన్, గిరి, దేవ, వల్లి పాల్గొన్నారు.

కేవీబీపురం : ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను వంద రోజుల్లోనే అమలు చేసి ఇది మంచి ప్రభుత్వంగా తెదేపా ప్రభుత్వం గుర్తింపు పొందిందని బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు సురేష్ చౌదరి, దొరబాబునాయుడు, మునికృష్ణయ్య, అఖిల్, మునికృష్ణ, మస్తాన్, శ్రీనివాసులు, శంకర్, బాల, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేవీబీపురం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

ప్రజలు మెచ్చే పాలన

బీఎన్‌కండ్రిగ : చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వంద రోజుల్లోనే ప్రజలు మెచ్చే పాలన అందిస్తూ 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకుంటున్నారని మండల తెదేపా అధ్యక్షుడు ఎం.సుధాకర్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం బీఎన్‌కండ్రిగలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి గోడపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇందిరమ్మ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, తెదేపా నాయకులు



రేణిగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రస్తు రబీ సీజన్‌లో వరి పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మనోహర్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాజులమండ్యం, కృష్ణయ్యకాలువలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. **వరదయ్యపాళెం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కలిసి మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. మండల తెదేపా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు. **ఏర్పేడు :** చింతలపాళెం పంచాయతీలో ఏడీఏ భాస్కరయ్య ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. **తొట్టంబేడు :** చిన్నసింగమాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు. సహజ ఎరువులను వినియోగిస్తే ఆరోగ్యంతో పాటు ఆదాయం పొందవచ్చన్నారు.

కేవీబీపురం : సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించుకోవచ్చని ఏవో మురళీకృష్ణకుమార్ అన్నారు. మంగళవారం మహదేవపురం, కేవీబీపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. **సత్యవేడు:** మదనంబేడులోని రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి మురళి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. **నాగలాపురం:** వేంబాకం, బైటకొడియంబేడు, పిచ్చాటూరు మండలంలోని రామగిరి, అప్పంబట్టు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. **బీఎన్‌కండ్రిగ:** వ్యవసాయంలో మెళకువలు పాటిస్తూ మంచి దిగుబడి సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్యానాయుడు సూచించారు. పుత్తేరి, ఆలత్తూరు గ్రామాల్లో ఏవో భారతి ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రత్యేక హోదాకు సైకిల్ యాత్ర

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే పురోభివృద్ధి చెందుతుందని కావలికి చెందిన కంతూరు శ్రీనివాస్ అన్నారు. ఇందు కోసమని కావలి నుంచి కాణిపాకానికి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తికి వచ్చారు. కాంగ్రెస్ జెండాలతో సైకిల్‌పై యాత్రను చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అన్నది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. హరియాణాలో కాంగ్రెస్ విజయం సాధించినందుకు కావలి నుంచి కాణిపాకం వెళ్లి వినాయకస్వామిని దర్శించుకోవాలని మొక్కుకున్నట్లు వివరించారు.

సంక్షిప్త సమాచారం

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం.. శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు) : జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కునాటి సురేష్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సత్కరించారు. సురేష్ స్వగ్రామమైన అక్కుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్థానికులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన నేతలు ఘనంగా సత్కరించి అభినందించారు. బొజ్జల రిషితారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, చెంచయ్య నాయుడు, నాగరాజు, రాజ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సేవల్లో భాగం కావాలి.. తొట్టంబేడు : ప్రతి విద్యార్థి చదువుతో పాటు సేవల్లో భాగం కావాలని తొట్టంబేడు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రేణుకమ్మ తెలిపారు. మంగళవారం జాతీయ సేవా పథక దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. డా.శ్రీలత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త నాగసరోజలక్ష్మి, శ్రీహరిరెడ్డి, హేమలత, ఉదయలక్ష్మి, స్వర్ణలత, శైలజ పాల్గొన్నారు.

విదేశీ వైద్య బృందం సందర్శన.. బీఎన్‌కండ్రిగ: స్థానిక పీహెచ్‌సీని ఇథియోపియా దేశానికి చెందిన వైద్య బృందం మంగళవారం సందర్శించారు. 'టీఆర్ ఐయుఎం' ప్రాజెక్టులో భాగంగా 'ఫర్ హెల్తీ బేబీ' శిక్షణా కార్యక్రమంపై ఎస్వీ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.వాసిం బృంద సభ్యులకు ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. ఎస్వీ కళాశాల వైద్యులు డా.వినాయక్, డా.హరి, డా.వైష్ణవి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి.. రేణిగుంట : ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని భాజపా నాయకుడు వెంకటాద్రియాదవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోది జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక వెంకటాపురం పంచాయతీలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాజపా నాయకులు భాస్కర్‌రావు, ఉదయ్‌రాజు, రవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

తుడ లేఅవుట్ల పరిశీలన.. రేణిగుంట : తుడా పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని తుడా అధికారులను ఉపాధ్యక్షురాలు మౌర్య ఆదేశించారు. మంగళవారం రేణిగుంట మండలంలోని తుడ లేఅవుట్లను ఆమె పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని ఉన్న లేఅవుట్లలో ప్లాట్ల మధ్య రోడ్లు, డ్రైన్లు, ఓపెన్ స్పేస్, విద్యుత్ తీగలు, నీటి సౌకర్యాన్ని పరిశీలించాలని, అలా ఉంటేనే అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. అలా కుండా అనుమతులు మంజూరు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

సర్వీసు రోడ్డులోనే బస్సులు నడపాలి.. రేణిగుంట : దిగువ మల్లవరం మీదుగా గతంలో మాదిరి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఆకాంక్ష స్వచ్ఛంద ప్రతినిధులు కోరారు. మంగళవారం తిరుపతిలో ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డిని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 16 గ్రామాలకు దిగువ మల్లవరం కూడలని, రోజూ వందల సంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు ఇక్కడి నుంచి రేణిగుంట, తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. జాతీయ రహదారిని గ్రామానికి కాస్త దూరంలో నిర్మించిన తరువాత దిగువ మల్లవరం వైపు ఉన్న పాత రోడ్డులో బస్సులు రావడం లేదని సర్వీసు రోడ్డులో గ్రామం వైపు రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత సేవకులకు ఉద్వాసన.. శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉచిత విధులు నిర్వహిస్తున్న ఉచిత సేవకులకు ఉద్వాసన పలికారు. స్వామి, అమ్మవార్లతో పాటు పలు ప్రాంతాల్లో పనిచేసే వాళ్లను మంగళవారం ఆలయం నుంచి పంపేశారు. ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ ఆజాద్ పరిపాలనపై తనదైన ముద్రతో దృష్టి సారించారు.

హుండీ లెక్కింపునకు ఏర్పాట్లు.. బాధ్యతలు చేపట్టిన వెంటనే నూతన ఈవో చంద్రశేఖర్ ఆజాద్ హుండీ లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి, అమ్మవార్లతో పాటు పరివార దేవతామూర్తుల హుండీలను లెక్కించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

75శాతం రాయితీతో జొన్న విత్తనాలు .. సత్యవేడు : ప్రభుత్వ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులకు తెలియజేసే బాధ్యత సంబంధిత సెక్రటరీలపై ఉందని ఎంపీడీవో చంద్రశేఖర స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ప్రతిమ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. 75 శాతం రాయితీతో జొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు, పశువుల షెడ్ల నిర్మాణానికి తొలి విడతగా 40యూనిట్లు మంజూరయ్యాయని వెటర్నరీ డా.దయాకర్ తెలిపారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ.. కేవీబీపురం : మండల స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన కేజీబీవీ విద్యార్థినులను మంగళవారం పాఠశాల ఆవరణంలో ఎస్‌వో సుకన్య, పీఈటీ సతీ సావిత్రి అభినందించారు. మండలంలోని అంజూరు ఉన్నత పాఠశాలలో ఈ నెల 13 నుంచి 18 వరకు పలు క్రీడలకు సంబంధించి మండల స్థాయి పోటీలు నిర్వహించగా.. ఆ పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనిబరిచారన్నారు.

రుణంతో ఆసరా.. కష్టంతో ఆదాయం

స్వయంశక్తి దిశగా నారీ పయనం

నాగలాపురం, న్యూస్‌టుడే: ఇంటిపట్టునే ఉంటూ మహిళలు భిన్నంగా ఆలోచిస్తూ ఉపాధిని పొంది ఆదాయం ఆర్జిస్తున్నారు. తమలోని ఆలోచనలకు పెట్టుబడులు జోడిస్తూ సర్వవలయ అభివృద్ధి సాధన దిశగా పయనిస్తున్నారు. రుణాలతో అందిన ఆసరాతో పెట్టుబడులను సిద్ధం చేసుకుని మేలైన ఆదాయాన్ని పొందుతూ కుటుంబ పెద్దలుగా మారుతున్న పలువురు మహిళల వివరాలివిగో..

సిమెంటు వ్యాపారంతో లక్ష్మీకటాక్షం



నాగలాపురానికి చెందిన లక్ష్మి భవన నిర్మాణ కార్మికురాలిగా, భర్త మేస్త్రిగా పని చేసేవారు. పొదుపులో రూ.2 లక్షల రుణం తీసుకుని ఏడాదిన్నర కిందట సిమెంటు, కంకర వ్యాపారం ప్రారంభించారు. భర్తను కూలీ పనులకు పంపకుండా దుకాణ నిర్వహణలో భాగం చేశారు. దుకాణ నిర్వహణ ఖర్చులు, పెట్టుబడ్డి వడ్డీలు పోను నెలకు రూ.40 వేలు ఆర్జిస్తూ కుటుంబాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లారు.

చిల్లరకొట్టుతో భారతి విజయం



నాగలాపురం గ్రామానికి చెందిన భారతి ఇంటిపట్టునే ఉండేవారు. భర్త సోడా వ్యాపారంతో నడిపేవారు. అంతంత మాత్రపు ఆదాయం వచ్చేది. వెలుగులో వచ్చిన రూ.2 లక్షల రుణం తీసుకుని ఇంటి వద్దనే చిల్లరకొట్టు ఏర్పాటు చేశారు. సరకుల సామర్థ్యాన్ని పెంచి చిల్లరకొట్టును నడిపిస్తూ కుటుంబపోషణకు అవసరమైన సంపాదన సాగిస్తున్నారు.

పాడి పశువులతో వనమ్మ వికాసం



కాళంజేరికి చెందిన వనమ్మ గతంలో భర్తతో కలసి కూలీలకు వెళ్లేవారు. ఇంటిల్లిపాది వ్యవసాయ పనులకు వెళ్లినా కుటుంబ పోషణ భారంగానే ఉండేది. రూ.2 లక్షలు రుణం పొంది రెండు పాడి పశువులను కొనుగోలు చేశారు. ఇంటిపట్టునే పశువుల పోషణ చూసుకుంటూ సేకరించిన పాలను విక్రయిస్తూ నెలకు రూ.20 వేలు సంపాదిస్తున్నారు.

పూల వ్యాపారంతో చిట్టెమ్మ



కాళంజేరికి చెందిన చిట్టెమ్మ వ్యవసాయ కూలీగా పనిచేసేవారు. వెలుగులో రుణం తీసుకుని పువ్వుల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. వ్యాపారంలో పోటీని తట్టుకుని నిలిచి నెలకు రూ.15 వేలు సులువుగా సంపాదిస్తూ కుటుంబపెద్దగా ఆమె మారారు.

న్యాయం చేయండి .. సత్యవేడు : మండలంలోని మల్లవారిపాళెం వెస్ట్ పంచాయతీకి చెందిన ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు సంబంధించి శ్రీనిధి, సీఐఎఫ్ నగదును మండలంలోని యరగుళం గ్రామానికి చెందిన బాష రూ.6లక్షల వరకు స్వాహా చేశారని శ్రీసిటీ ఎస్సై హరిప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యం .. ఏర్పేడు, న్యూస్‌టుడే: ఎండీపుత్తూరుకు చెందిన ఓ యువతి(20) అదృశ్యం కావడంతో ఏర్పేడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కూలి పనులకు వెళ్లి తిరిగివచ్చేసరికి ఇంట్లో కుమార్తె లేకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టగా ఆచూకి లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ జయచంద్ర తెలిపారు.

మద్యం స్వాధీనం.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏపీసీడ్స్ వద్ద మద్యం బాటిళ్లు కల్గిన వ్యక్తిని పట్టణ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మంగళవారం 40 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న విషయమై బాటిళ్లు స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు.

గ్యాస్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు.. నాగలాపురం, న్యూస్‌టుడే: గ్యాస్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కారణి వద్ద మంగళవారం జరిగింది. చిన్నాపట్టుకు చెందిన మార్కండేయులు కారణిలో వ్యవసాయ పనులు చేయటానికి ఎద్దుల బండిపై వెళ్తుండగా.. గ్యాస్ ట్యాంకర్ ఢీకొంది. మార్కండేయులును మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో హనీఫ్‌మహ్మమద్ తెలిపారు.

ఇసుక తరలింపుపై వివాదం.. శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డికండ్రిగలో ఇసుక వివాదం తీవ్రస్థాయికి చేరింది. గ్రామానికి చెందిన కొందరు ఇసుకాసురులు సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి విచ్చలవిడిగా ఇసుక తరలిస్తుండటంతో నదిలోని శ్మశానవాటిక సైతం కనుమరుగవుతోంది. దీంతో స్థానికులంతా ఏకమై నదిలోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా సోమవారం కందకాలు తవ్వించారు. అయితే ఇసుకాసురుల మాత్రం రైతులు తవ్విన కందకాలను మంగళవారం పూడ్చేసి ఇసుక అక్రమ రవాణాను కొనసాగించడంతో వివాదానికి దారితీసింది. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మీనారాయణను వివరణ కోరగా సమస్య తన దృష్టికి వచ్చిందని, వెంటనే వీఆర్వోను పంపించి ఇసుక రవాణాను అడ్డుకున్నామని తెలిపారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం:
కేజీ రూ. 80 నుంచి
రూ. 100 వరకు
రెండో రకం:
కిలో రూ. 60 నుంచి
రూ. 70 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	122
లేయర్	144
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	260
లేయర్ మాంసం	195

బంగారు పాదాలకు సంప్రోక్షణ

వెంకటగిరి: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ బంగారు పాదాలకు సంప్రోక్షణ చేశారు. మంగళవారం పోలేరమ్మ ఆలయం వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారి పాదాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాదాలను భక్తుల దర్శనం కోసం ఉంచారు.

జాతరకు పోలేరమ్మ చప్పరం ముస్తాబు

వెంకటగిరి : వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో అమ్మవారిని ఊరేగించేందుకు చప్పరంను దేవాదాయ శాఖ సిద్ధం చేసింది. చప్పరం ఇరుసు, ఇతర భాగాలను ర.భ శాఖ సిబ్బంది పరిశీలించి మరమ్మతు చేశారు. అమ్మవారిని ప్రతిష్ఠించే పీఠం, వెనుక భాగంలోని ప్రతిమలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో విశ్రాంత ఉపాధ్యాయుడు పాపారావు బృందం ఆధ్వర్యంలో చప్పరం పీఠం, ఇతర వాటికి రంగులు వేశారు. ఆలయం వద్ద క్యూలైన్



ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

పులికాట్ పల్లెల్లో మౌలిక వసతులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పులికాట్ పల్లెల్లో మౌలిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని కోటపోలూరులో మంగళవారం సాయంత్రం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పులికాట్ పల్లెలకు రోడ్డు, ఇరకం దీవిలో సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతిలేని బోట్ల ద్వారా సముద్రంలో పొరుగు రాష్ట్రం వారు జిల్లాలో చేపల వేట సాగిస్తున్నారని దీనిపై దృష్టి సారిస్తామని చెప్పారు. పులికాట్ అభయారణ్యం సంరక్షణతో పక్షులు, పర్యావరణం సంరక్షణకు చర్యలు, పూడి రాయిదొరువు వద్ద పులికాట్ ముఖద్వారం పూడికతీతపై దృష్టి పెడతామని వివరించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ నరసింహారావు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం పోషన్, డొక్క సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. మండలంలోని మావిళ్లపాడు ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ సీహెచ్ సుమలతతో కలిసి మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

దీపాలుండవు.. ఉన్నవి వెలగవు

- కొన్ని చోట్ల పగలే వెలుగులు
- రాత్రిళ్లు రోడ్డెక్కాలంటే భయపడుతున్న ప్రజలు

ప్రజల సౌకర్యార్థం వీధుల్లో ఏర్పాటు చేసిన దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో ప్రజలు రోడ్డెక్కాలంటే భయాందోళన చెందుతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు.



బాలాయపల్లి మండలం మన్నూరులో ప్రధాన కూడలిలో దీపాలు వెలగడం లేదు. పెరిమిడి, హస్తకావేరి, మేల్చూరు, పిగిలాం తదితర గ్రామాల్లో సైతం చీకట్లు అలముకున్నాయి. మరోవైపు బాలాయపల్లి పంచాయతీ యాచవరం, పెరిమిడి పంచాయతీ బొల్లవారిపాళెం, అలిమిలి పంచాయతీ అంబలపూడి తదితర గ్రామాల్లో పగలూ రాత్రిళ్లు తేడా లేకుండా వెలుగుతుండటం గమనార్హం. విద్యుత్తు వృథాతో పాటు దీపాలు పాడయ్యే అవకాశం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. డక్కిలి మండలం మిట్టపాళెం, దగ్గవోలు, కమ్మపల్లి, వెంబులూరు, శ్రీపురం తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

\- న్యూస్‌టుడే, వెంకటగిరి గ్రామీణం

నాయుడుపేట కోళ్లపారంలో విద్యుత్తు స్తంభానికి రెండు వీధి దీపాలు అమర్చడం ఒక ఎత్తైతే.. అవి పగలు వెలగడం గమనార్హం. మరో వైపు పురపాలికలో రూ.కోట్లలో విద్యుత్తు బకాయిలు పేరుకున్నాయి. ఈ తరుణంలో విద్యుత్తు ఆదాపై దృష్టి సారించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. నిత్యం ప్రజలు తిరిగే చోట స్తంభాలకు తీగలు అల్లుకున్నా సంబంధితాధికారులు అటు వైపు తొంగి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

\- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం





కోట అడ్డరోడ్డు సమీపంలోని చల్లకాలువ వంతెన మార్గం ఎప్పుడు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో కోట-వాకాడు, కోట-విద్యానగర్, గూడూరు-నాయుడుపేట, నెల్లూరు తదితర మార్గాల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయాల్లో రద్దీ మరింతగా ఉంటుంది. అయితే వంతెనపై ఇరువైపులా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో భవానిని వివరణ కోరగా పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామన్నారు.

\- న్యూస్‌టుడే, కోట

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

\- న్యూస్‌టుడే, కోట

సమస్య: కోట గిరిజన కాలనీకి చెందిన శ్మశానవాటికకు వెళ్లడానికి చల్ల కాల్వ పొర్లుకట్టపై మెట్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదు. **- బాబు, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- భవాని, ఎంపీడీవో.**



కరపత్రాలు అందిస్తున్న తెదేపా నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తిరుపతి పార్లమెంట్ తెదేపా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య తెలిపారు. పట్టణంలోని 22వ వార్డులో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఇస్రాయిల్ కుమార్, సచివాలయ అడ్మిన్ సుధాప్రియ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



వేదికపై ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. కోటలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం క్రీడల జెండాను ఆవిష్కరించి నియోజకవర్గ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కోట, చిట్టమూరు, వాకాడు, గూడూరు, చిల్లకూరు మండలాల్లోని 75 పాఠశాలకు చెందిన 600 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్‌అహ్మద్, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి ప్రధానోపాధ్యాయుడు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'బాధ్యులను జైలుకు పంపుతాం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి (బాలాయపల్లి), న్యూస్‌టుడే: డక్కిలి పంచాయతీలో రూ. 58.72 లక్షలు స్వాహా జరిగినట్లు ఇటీవల ఆడిట్‌లు తేల్చాయని ఈ అవకతవకలపై కేసులు పెట్టి బాధ్యులను జైలుకు పంపుతామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని శ్రీపురంలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జనసేన నేతలు

జనసేన ఇన్‌ఛార్జి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే

నాయుడుపేట పట్టణం : నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి ఉయ్యాల ప్రవీణ్ జన్మదిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయానికి నిర్విరామంగా పని చేశారన్నారు. జనసైనికులు, కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి గొప్ప విజయాన్ని అందించారన్నారు. పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ షేక్.రఫీ, కూటమి నాయకులు నెలవల రాజేష్, పార్థసారథి, రంగినేని కృష్ణయ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయం శుద్ధి



పూజలు చేస్తున్న కూటమి నాయకులు

కోట, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలోని కూటమి నాయకులు సంయుక్తంగా స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. తిరుమల లడ్డూ కల్తీ చేయడం దారుణమన్నారు. అందుకు పరిహారంగా ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

మడుగు కాదు.. రహదారే

కోట ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వినాయకుడి గుడి వీధిలో ప్రధాన రోడ్డుపై మురుగు చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 20 సంవత్సరాల కిందట నిర్మించిన మురుగు కాలువ నిర్వహణ వైఫల్యంతో పూడిపోయింది. దీంతో మురుగు రోడ్డెక్కి పారుతోంది. సమస్యను పలుమార్లు సంబంధితాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట పంచాయతీ ఈవో శ్రీనివాసులును వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కోట**





పొలం పిలుస్తోంది

పెళ్లకూరు: కరపత్రాలు విడుదల చేస్తున్న ఏవో ప్రవీణ, రైతులు

పెళ్లకూరు : ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రవీణ తెలిపారు. పుల్లూరులో మంగళవారం ప్రచార పత్రాలు విడుదల చేశారు. **దొరవారిసత్రం :** రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా అవసరమైన ఎరువులు వాడాలని సూళ్లూరుపేట ఏడీఏ జి.అనిత సూచించారు. మండలంలోని తనయాలిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఏవో సుభాషిణి, వీఆర్వో మురళి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **నాయుడుపేట:** మండలంలో భీమవరం, మేనకూరు గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యాయన అధికారి శారద, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. **తడ :** మండలంలోని వెండ్లూరుపాడు, మాంబట్టు పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కాంచన రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పించారు. పలువురు రైతులు పాల్గొన్నారు. **సూళ్లూరుపేట :** వ్యవసాయ అధికారుల సూచనలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో కవిత పేర్కొన్నారు. మన్నారుపోలూరు, కోటపోలూరులో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

స్వచ్ఛతా హీ సేవా.. ఇదేనా

- ఆర్టీసీలో కనిపించని శుభ్రత
- ఫ్లెక్సీలు, బ్యానర్లతో సరి



సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో ఎదుట ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం పరిసరాల శుభ్రత కోసం ఈ నెల 17 నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి ప్రభుత్వ శాఖకు ఆదేశాలిచ్చారు. దీనిని 15 రోజుల పాటు నిరంతరాయంగా నిర్వహించాలి. అందులో భాగంగా ఏపీ ప్రజా రవాణా విభాగంలో 'స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు' ఈ నెల 17 నుంచి అక్టోబరు ఒకటి వరకు నిర్వహించేలా ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించి ఆయా డిపోలకు మార్గదర్శకాలు ఇచ్చారు. కార్యక్రమాన్ని 'స్వభావ స్వచ్ఛత..సంస్కార స్వచ్ఛత', 'పరిసరాల శుభ్రత..మనందరి బాధ్యత' నినాదాలతో చేపట్టాలని ఆదేశించారు. ఆ మేరకు ఆర్టీసీ డిపోల్లో, బస్టాండుల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. పలుచోట్ల చేపట్టలేదు. అయితే డిపో పరిసరాల్లో, బస్టాండు పరిసరాల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండటం గమనార్హం. కార్యక్రమం ప్రారంభించి ఎనిమిది రోజులు కావస్తున్నా.. ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే..

సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలోనూ.. ముందు భాగంతోపాటు దక్షిణం వైపున పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి విషసర్పాలకు ఆవాసంగా మారింది. డిపోలో సుమారు 300 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వేకువజామున, రాత్రివేళ విధులకు వచ్చేవారు, ముగించుకుని వెళ్లేవారు ఎక్కడి నుంచి ఏ విషపురుగు వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. గతంలో డిపో వద్ద పాముకాటుతో ఇద్దరు ఉద్యోగులు దుర్మరణం చెందగా.. మరో ఇద్దరు గాయపడిన విషయం విదితమే. ఇంత జరిగినా ఇక్కడ పిచ్చి మొక్కలు, విషసర్పాల సంచారం గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు కేవలం ప్రచారాలకే పరిమితమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు. నాయుడుపేట, సూళ్లూరుపేట బస్టాండ్లలో ఇంకా కార్యక్రమాలు చేపట్టకపోవడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.



బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

వాకాడు : కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా నిలుస్తుందని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం దుగ్గరాజపట్నం, కొండూరు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

ఘర్షణ కేసులో ఒకరి అరెస్టు.. దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మోదుగులపాళానికి చెందిన సుబ్రమణ్యంపై దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడైన శాంతాల మాధవయ్యను మంగళవారం అరెస్టు చేసి నెల్లూరు జైలుకు తరలించినట్లుగా స్థానిక ఎస్సై అజయ్‌కుమార్ పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ల నిలిపివేత.. నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తుడా అనుమతులు లేకుండా ఉన్న లేఅవుట్లలో స్థలాల రిజిస్ట్రేషన్లు చేయకూడదని పురపాలిక అధికారులు రిజిస్ట్రేషన్ల అధికారికి మంగళవారం ఆదేశాలు పంపారు. ప్రాంతాల వారిగా ఉన్న అక్రమ లేఅవుట్ల వివరాలను అందజేయాలన్నారు.

విద్యార్థి అదృశ్యం .. పెళ్లకూరు, న్యూస్‌టుడే: రావులపాడుకి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి తోట చరణ్ అదృశ్యమయ్యారు. సోమవారం శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో తండ్రి శేఖర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య కేంద్రాలపై నీలినీడలు

- నేటికీ పూర్తికాని వైనం
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురపాలికలో పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు సంకల్పించారు. పనులు చేపట్టారు కానీ పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చూపారు. కొన్ని చోట్ల భవనాలు అందుబాటులోకి తెచ్చినా.. గూడూరులో మాత్రం నేటికీ పూర్తి చేయలేదు. వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు సరిగా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలున్నాయి. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.



గూడూరులో అసంపూర్తిగా ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం

గూడూరులో గత ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రం మంజూరు చేసింది. భవన నిర్మాణానికి రూ. 80లక్షలు కేటాయించారు. గూడూరుతో పాటు నాయుడుపేటలో రెండు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నగరంలో 12, ఆత్మకూరు, కావలి, బుచ్చిరెడ్డి పాలెంలో ఒకటి చొప్పున మంజూరు చేశారు. అన్నీ చోట్ల నిర్మాణాలు పూర్తి చేసి వినియోగిస్తున్నా..మొదటిగా శంకుస్థాపన చేసిన గూడూరులో మాత్రం ఇంత వరకు పూర్తి కాకపోవడం గమనార్హం. సొంత భవనం లేక అద్దె భవనాల్లో రూ.వేలకు, వేలు అద్దెలు చెల్లిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తయితే మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా పూర్తయ్యేలా చూస్తాం

పట్టణ ఆరోగ్య కేంద్రం పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. గుత్తేదారుతో చర్చించి పనుల్లో జాప్యం లేకుండా చూస్తాం.

\- వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్, గూడూరు

ప్రతి భక్తుడికి దర్శనం.. వెంకటగిరి : వెంకటగిరి పోలేరమ్మ జాతర సందర్భంగా ప్రతి భక్తుడు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టామని సీఐ వెంకటరమణ అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వాహనాలు పార్కింగ్ చేసేందుకు పాలకేంద్రం, క్రాస్‌రోడ్డు సెంటర్‌లో పార్కింగ్ వసతి కల్పించామన్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఉంచితే చర్యలు తప్పవన్నారు. 1250 మంది పోలీసులతో అమ్మవారి జాతరలో బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పోలేరమ్మ ఆర్చీ వద్ద ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సుబ్బారావు, జిత్యా నాయక్ పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌ను యూనివర్సిటీ స్థాయికి పెంచుతాం.. కోట, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీని యూనివర్సిటీ స్థాయికి పెంచుతామని కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

26న గూడూరులో ఉద్యోగమేళా .. గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ఈ నెల 26న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 86398 35953 చరవాణిని సంప్రదించాలన్నారు.

సరకుల పంపిణీ.. కోట, న్యూస్‌టుడే: స్థానిక కోటమ్మ దేవత ఆలయ ప్రాంగణంలో నాగలాపురానికి చెందిన దాతలు గిరిధర్‌రెడ్డి, మహేశ్వరమ్మ దంపతులు షిరిడీ సాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం 40 పేద కుటుంబాలకు రూ.60వేలు విలువ చేసే నిత్యావసర సరకులు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం.. వాకాడు, న్యూస్‌టుడే: బాలిరెడ్డిపాలెంలోని శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యానగర్‌కు చెందిన విద్యార్థి ధరణికోట మహేష్‌కు మంగళవారం రూ. 6 వేలు ఆర్థిక సాయం అందించారు. దాతలు గిరిధర్‌రెడ్డి, మహేశ్వరమ్మ దంపతులు, సాంబశివరావు ఈ సాయం చేసినట్లు సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి.. గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని, అప్పుడే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని విహాన్ ఎలక్ట్రికల్స్ సీఈవో వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యుత్తు వాహన ప్రయోగశాలను కళాశాల యాజమాన్యంతో కలిసి ప్రారంభించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

సమాజంలో యువత పాత్ర కీలకం .. సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సమాజాన్ని చైతన్యం చేయడంలో యువత పాత్ర కీలమని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డి.నాగభూషణం పేర్కొన్నారు. సూళ్లూరుపేటలోని వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు.

వాకాడు ఆర్టీసీ డిపో మేనేజరుగా పెంచలయ్య .. వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు ఆర్టీసీ డిపో మేనేజరుగా చిత్తూరు జిల్లా కుప్పం డిపో మేనేజరు ముచ్చాల చిన పెంచలయ్యను ఉన్నతాధికారులు నియమించారు. నాలుగు రోజుల్లో బాధ్యతలు తీసుకుంటానని న్యూస్‌టుడేకు మంగళవారం చెప్పారు.

విద్యుత్తుశాఖ అధికారిగా సురేష్ బాబు.. పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు విద్యుత్తు శాఖ అధికారిగా సురేష్‌బాబు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. సూళ్లూరుపేట నుంచి ఇక్కడికి రాగా ఇక్కడ ఏఈ అంజాద్‌బాషాను నాయుడుపేట గ్రామీణ ప్రాంతానికి బదిలీ చేశారు.

ఎంపీడీవోగా సురేష్‌బాబు.. నాయుడుపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈయన పెళ్లకూరు నుంచి ఇక్కడకు బదిలీకానున్నారు. వీరి స్థానంలో సూళ్లూరుపేట ఎంపీడీవో ప్రమీలారాణిని నియమించనున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ప్రచారం జరగాలి.. నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం జరగాలని నవ జీవన్ సంస్థ మేనేజరు బాలాజీ పేర్కొన్నారు. నాయుడుపేట సీవీ రామన్ డిగ్రీ కళాశాల్లో మంగళవారం ఎయిడ్స్, హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పక్కా ఇళ్లు పూర్తి చేయాలి.. తడ, న్యూస్‌టుడే: నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా పంచాయతీ అధికారులు ప్రత్యేక అవగాహన కల్పించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయ్ కుమార్ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 'మన ఇళ్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం .. నాయుడుపేట పట్టణం : పోషకాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ఉమామహేశ్వరి పేర్కొన్నారు. కూచవాడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

4 నుంచి అంతరిక్ష వారోత్సవాలు..

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోట ఆధ్వర్యంలో వచ్చే నెల 4 నుంచి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మూడు రాష్ట్రాల్లో ఎనిమిది ప్రాంతాల్లో వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులను ఇందులో భాగస్వామ్యం చేస్తూ.. ఇస్రో సీనియర్ శాస్త్రవేత్తలు ఉపన్యాసాలు, ప్రయోగాలు, ఉపగ్రహాలు ప్రదర్శనలతో పాటు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారు.